


నేడు రంగనాథుడికి బంగారు గరుడసేవ

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నరసింహ జయంతి సందర్భంగా తల్పగిరి రంగనాథ స్వామికి బుధవారం బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్, ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉత్సవం ఉదయం 8 గంటలకు రంగడి ఆలయం నుంచి ప్రారంభమై ఉభయకర్త రాజా హజరత్‌బాబు నివాసం ఉంటున్న లక్ష్మీపురానికి చేరుకుంటుందని తెలిపారు. అక్కడ విశేష పూజలు నిర్వహిస్తారని, భక్తులందరూ తరలిరావాలని కోరారు.



బుచ్చిరెడ్డిపాలెం : మినగల్లు రీచ్ ఒడ్డున ఉన్న భారీ ఇసుక డంప్

ఇసుక అక్రమాలకు
బ్రేక్ పడేనా!?

ఇసుక.. ఒకప్పుడు ఈ పేరు చెబితే ఉచితం అనే మాట గుర్తుకొచ్చేది. ఇప్పుడు ఆ పదం వినిపిస్తే అధికార వ్యవస్థలో వణుకు పుడుతోంది. వైసీపీ పెద్దల దోపిడీకి కల్పతరువుగా మారిన ఈ ఖనిజం వైపు చూసేందుకు కూడా ఏ ఒక్క అధికారి గడిచిన ఐదేళ్లుగా సాహసించలేదు. టన్నుల కొద్దీ ఇసుక తరలిపోతున్నా జిల్లా ఉన్నతాధికారులు మాత్రం అబ్బే.. అటువంటిదేమీ లేదు అని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు (ఎన్జీటీ) నివేదిక ఇవ్వడం గమనార్హం. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు ఒకటే ఫార్మాట్‌లో నివేదిక ఇవ్వడంతో ఆశ్చర్యపోయిన ఎన్జీటీ.. వారి పనితీరును వేలెత్తి చూపింది. ఈ నేపథ్యంలో తాజాగా ఇసుక అక్రమ తవ్వకాలపై సాక్షాత్తూ సుప్రీం కోర్టు సీరియస్ అయ్యింది. ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేకులు వస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఈ ప్రక్రియలో పాల్గొనే ప్రతి అధికారీ సుప్రీంకోర్టు నియమించిన అధికారిగా వ్యవహరించాలని, కాదని ప్రవర్తిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించడం విశేషం. ఈ క్రమంలోనైనా జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలకు బ్రేక్ పడుతుందా!? దర్జాగా దోపిడీ చేస్తున్న అక్రమార్కులను నిలువరి స్తారా!? ఇప్పటి వరకూ జరిగిన దోపిడీని నిగ్గు తేలుస్తారా!? అన్నది చర్చనీయాంశంగా మారింది.

- అక్రమ తవ్వకాలపై సుప్రీంకోర్టు సీరియస్
- వెంటనే తవ్వకాలు నిలిపేయాలని ఆదేశం
- ఫిర్యాదులకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు సూచన
- అధికారులు, పోలీసులతో ప్రత్యేక బృందాలు
- అధికారులు కదిలేనా.. అక్రమాలు నిగ్గు తేలేనా!?

నెల్లూరు, మే 21 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందుతున్న ఇసుకకు వైసీపీ ప్రభుత్వం వెలకట్టింది. భారీ ధరను నిర్ణయించింది. పోనీ ఆ ధర కన్నా ఇసుక దొరుకుతుందా.. అంటే అందుకూ నానా తంటాలు పడాలి. పెన్నా పరివాహక ప్రాంతాలైన పడమటి కంభంపాడు, సంగం, అప్పారావుపాలెం, మినగల్లు, ముదివర్తి, విరువూరు, పొట్టేపాలెం, గొల్లకందుకూరు, పల్లిపాలెం రీచ్‌ల ద్వారా పెన్నా నదిని కుళ్లబొడిచారు. ఎంత తవ్వుతున్నారు..? ఎంత విక్రయిస్తున్నారు..? అన్న వాటికి లెక్కలు లేవు. తెల్లకాగితాలపై బిల్లులు ఇస్తూ భారీ దోపిడీకి పాల్పడ్డారు. జిల్లాలో పుష్కలంగా ఇసుక నిల్వలు ఉన్నా జిల్లా వాసులకు మాత్రం ఇసుక కష్టాలు తప్పలేదు. ఈ అక్రమ తవ్వకాలపై గతేడాది కొందరు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతేడాది మార్చిలో ఇసుక తవ్వకాలను నిలిపేయాలని ఎన్జీటీ ఆదేశించింది.



దీనిపై అప్పటి కాంట్రాక్ట్ సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే నాలుగు రోజుల క్రితం ఈ కేసుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఇసుక అక్రమ తవ్వకాలు నిజమని నిర్ధారిం చుకున్న సుప్రీంకోర్టు.. అనుమతులు లేని చోట తవ్వకాలను ఆపేయాలని ఆదేశించింది. అయితే జిల్లాలో ఇంకా ఇసుక డంపింగ్ యార్డుల పేరుతో ఇసుక విక్రయాలు జరుగుతు న్నాయి. ప్రస్తుతం ప్రతిమా సంస్థకు ఇసుక టెండర్‌ను ప్రభుత్వం అప్పగించింది. గతేడాది డిసెంబరు నుంచి ఈ సంస్థ ఇసుక తవ్వకునేలా అందులో పేర్కొన్నారు. అయి తే గతేడాది మార్చిలోనే ఇసుక తవ్వకాలను నిలిపేయాలని ఎన్జీటీ ఆదేశించినప్పుడు ఇక ఆ తర్వాత తవ్వకాలు ఎలా జరుపుతారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చే వరకు ఎన్టీజీ ఆదేశాలు అమల్లో ఉన్నాయని, ఆ లెక్కన జిల్లాలో అసలు ఇసుకను తవ్వడానికి అనుమతులే లేవని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. అటువంటప్పుడు గతేడాది డిసెంబరులో టెండర్ దక్కించుకున్న ప్రతిమా సంస్థ ఇప్పుడు యార్డుల పేరుతో ఎలా ఇసుక వ్యాపారం చేస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ యార్డుల్లో ఎంత ఇసుక నిల్వ ఉంది? ఇప్పటి వరకూ ఎంత విక్రయించారు? అన్న వివరాలు ఏ ప్రభుత్వ శాఖ వద్ద లేవు. కనీసం ఆ యార్డుల వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా అధికారులు చేయలేక పోతున్నారు.

అక్రమాలపై ప్రత్యేక గ్రీవెన్స్ సెల్

ఇసుక అక్రమ తవ్వకాలను నిలిపేయడమే కాకుండా ఫిర్యాదుల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కలెక్టర్, పోలీసుల నేతృత్వంలో ఈ బృందాలు ఏర్పాటు కావాలని సూచించింది. ప్రత్యేక గ్రీవెన్స్ సెల్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి అక్రమ ఇసుక తవ్వకాలపై ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించింది. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ఇందుకు సంబంధించి జూలైలోపు కలెక్టర్లు అఫిడవిట్లు దాఖలు చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అధికారులు ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించి, ఒకటి, రెండు రోజుల్లోనే ఈ వివరాలను వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

● అక్రమాలు ఆగుతాయా!?

సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఇకపై జరిగే అక్రమాలను అడ్డుకునేందుకు అవకాశం కలిగింది. మరి ఇప్పుడైనా అధికారులు ఇసుక అక్రమాలపై కఠినంగా వ్యవహరిస్తారా? అన్నదే ప్రశ్నార్థకంగా మారింది. కాగా ఇప్పటి వరకూ జరిగిన అక్రమాలను సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలోనైనా నిగ్గు తేలుస్తారో లేదో చూడాలి. పెన్నాలో ఏ రీచ్‌ను పరిశీలించినా భారీ గుంతలు కనిపిస్తున్నాయి. గూగుల్ ఫొటోస్ ద్వారా విచారణ జరిపితే ఆ గుంతలు ఎప్పుడు తీశారు.. అన్నది తేలిపోతుంది. అయితే ఇప్పటి వరకూ జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు ఇంకా ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందలేదని జిల్లా అధికారులు చెబుతున్నారు.

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చేసిన వైద్యసేవలకు సంబంధించి బకాయిలు విడుదల చేయాలని పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినా పాలకులు పెడచెవిన పెట్టారు. ఇక తాము వైద్యసేవలు అందించలేమని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు తేల్చి చెప్పింది. బుధవారం నుంచి తమ ఆసుపత్రులలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు.

ఆరోగ్యశ్రీ సేవలు
నేటి నుంచి బంద్!

- నెట్‌వర్క్ ఆసుపత్రులకు పేరుకుపోయిన బకాయిలు
- ప్రైవేటు ఆసుపత్రులకు రూ.70 కోట్లు.. ప్రభుత్వ ఆసుపత్రులకు రూ.10కోట్ల పెండింగ్
- నోటీసులు ఇచ్చినా చలించని ప్రభుత్వం
- వైద్యసేవల నిలిపివేతకు ప్రైవేటు ఆసుపత్రుల సంఘం నిర్ణయం





నెల్లూరు (వైద్యం), మే 21 : బకాయిలు చెల్లించాలని నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యం ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌ను గత 6 నెలలుగా పలు దఫాలు నోటీసులు ఇచ్చింది. అయితే, రాష్ట్ర ప్రభుత్వం మొక్కుబడి చర్యలు తప్ప పూర్తిస్థాయి బకాయిలు చెల్లించలేదు. ఈ నెల 2వ తేదీనే నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం ప్రభుత్వానికి నోటీసులు అందించింది. బకాయిలు చెల్లించకపోతే ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సలు ఆపేస్తామని తేల్చిచెప్పింది. అయినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ పరిధిలో 32 ఆసుపత్రులు ఉన్నాయి. అలాగే 28 డెంటల్ ఆసుపత్రులు, ప్రభుత్వ పరంగా మరో 64 ఆసుపత్రులు ఉన్నాయి. అయితే నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కందుకూరు, కావలి ఏరియా ఆసుపత్రులలోనే కొద్ది మొత్తంలో ఆరోగ్యశ్రీ చికిత్సలు అందుతున్నాయి. డెంటల్ ఆసుపత్రులలో కేవలం ఈహెచ్ఎస్ కార్డులు ఉన్న వారికే వైద్యసేవలు అందిస్తున్నారు.

● రూ. 70 కోట్ల వరకు బకాయిలు

జిల్లాలోని ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.70 కోట్లకుపైగా బకాయి లు ఉన్నట్లు తెలుస్తోంది. ఆరోగ్యశ్రీ కింద అందించే వైద్యసేవలకు 60 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఏడాది దాటినా చెల్లింపులు నామమాత్రంగా ఉన్నాయి. బకాయిల కోసం ప్రభుత్వానికి నోటీసులు ఇస్తున్నా పలితం ఉండటం లేదు. కేవలం 20 శాతం బకాయిలు మాత్రమే చెల్లిస్తూ పబ్బం గడుపుకుంటోంది. దీంతో బకాయిలు సరిగ్గా రాకపోవటంతో నెల్లూరులోని రెండు కార్పొరేట్ ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ నుంచి బయటకు వచ్చేశాయి. ఏడాదికి 4500లకుపైగా జిల్లాలో శస్త్రచికిత్సలు జరుగుతున్నా బకాయిలు రాక నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆర్థిక ఇబ్బందులలో అల్లాడుతున్నా యి. ఈ నేపథ్యంలో ఆరోగ్యశ్రీ చికిత్సలు అందించేందుకు ఆయా ఆసుపత్రులు వెనుకాడుతున్నాయి. మరోవైపు ప్రభుత్వ ఆసుపత్రులకు కూడా రూ.10 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్నట్లు సమాచారం. బకాయిలు విడుదలైతే ఆసుపత్రిలో పలు మౌలిక సదుపాయాలు కల్పించే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రులపైనా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల ఫిర్యాదులను
పరిష్కరించండి!

● ఘర్షణలు, అల్లర్లు జరగకుండా చూడండి : ఆర్వోలతో కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), మే 21 : జిల్లాలో ఎన్నికలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి ఫిర్యాదును పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరినారాయణన్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎన్నికల తరువాత రాజకీయ ఘర్షణలు, అల్లర్లు తలెత్తకుండా ముంద స్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయిలో తహసీల్దార్లు, పోలీసు అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో పర్యటించాలని సూచించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతున్నందున కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. రాబోయే 13 రోజులు అప్రమత్తంగా ఉండి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఈ సమీక్షలో జిల్లా అదనపు ఎస్పీ సౌజన్య, కోవూరు రిటర్నింగ్ అధికారి సేతు మాధవన్, నెల్లూరు సిటీ ఆర్వో వికాస్ మర్మత్, కందుకూరు, కావలి ఆర్వోలు విద్యాధరి, శీనా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం... ఆత్మకూరు ఆర్డీవోకు నోటీసులు

ఆత్మకూరు, మే 21 : ఎన్నికల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆత్మకూరు ఆర్డీవో, ఆర్వో మధులతకు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ షోకాజ్ నోటీసు అందచేసినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. ఆత్మకూరులో జరిగిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలో, ఎన్నికల సామగ్రి పంపిణీలో సరైన సదుపాయాలు కల్పించకపోవడంతోపాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆయన ఆర్వో మధులతకు షోకాజ్ నోటీస్ అందచేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ నోటీసు అందుకున్న ఆమె ఏఆర్వోగా విధులు నిర్వహించిన ఆత్మకూరు తహసీల్దారు శివనాగిరెడ్డి, ఆర్ఐ పృథ్వీకి షోకాజ్ నోటీసులు అందజేశారు. ఏఆర్వో, ఆర్ఐకి షోకాజ్ నోటీసులు అందచేయడంతో ఈ విషయం వెలుగుచూసింది.

కోనలో పెంచలోరి వైభోగం

- సరస్వతీదేవి అలంకరణలో హంస వాహనంపై విహారం
- స్వర్ణ హనుమతుడిపై భక్తులకు దర్శనం

రాపూరు (డక్కిలి), మే 21 : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో శ్రీవారు హంసవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ముందుగా అలంకార మండపంలో స్వామివారిని విశేషంగా తీర్చిదిద్ది హంస వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం క్షేత్రోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణలతో కోన క్షేత్రం మారుమోగింది. ఆ తర్వాత ఊంజల్ సేవ, తిరుమంజనం సేవలు జరిగాయి. వివిధ సేవలతో అలసిన శ్రీవారిని సేదతీర్చేందుకు అర్చకులు స్నపన, తిరుమంజనం జరిపించారు. దేవదేవుళ్ల ఉత్సవ విగ్రహాలను పాలు, పెరుగు, తేనె, వివిధ రకాల పళ్లరసాలు, చందనం, పసుపు, కొబ్బరి నీటితో అభిషేకించారు. యాగశాలలో లక్ష్మీనృసింహ స్వామి హోమం జరిగింది.

● హనుమపై వైభోగం

శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి రాత్రి బంగారు హనుమంతుడిపై విహరిం చారు. మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ ఏసీ సాగర్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

● నేడు గరుడవాహన సేవ

బుధవారం నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారు తనకిష్టమైన స్వర్ణగరుడ వాహనంపై విహరించనున్నారు. ఈ వేడుకలను తిలకించడానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. రద్దీ దృష్ట్యా ఆర్టీసీ అధికారులు 120కి పైగా బస్సులను తిప్పనున్నారు.



స్వర్ణ హనుమంతుడిపై విహరిస్తున్న పెంచలస్వామి

సంబరాలకు సన్నద్ధం

- నేడు విక్రమ సింహపురి వర్సిటీ 8, 9 స్నాతకోత్సవాలు
- పాల్గొననున్న రాష్ట్ర గవర్నర్
- ఏర్పాట్లను పరిశీలించిన ఉన్నతాధికారులు

వెంకటాచలం, మే 21 : కాకుటూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) 8, 9 స్నాతకోత్సవాలు బుధవారం జరగనున్నాయి. ఎంతో అట్టహాసంగా జరిగే ఈ వేడుకల్లో రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ పాల్గొననున్నారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం జిల్లా ఉన్నతాధికారులు, వర్సిటీ వీసీ సుందరవల్లి, రిజిస్ట్రార్ రామచంద్రారెడ్డిలతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. యూనివర్సిటీ ప్రాంగణంలో స్నాతకోత్సవం జరిగే సభా ప్రాంగణాన్ని, గ్యాలరీలు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు వర్సిటీని తమ ఆధీనంలోకి తెచ్చుకుని పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో గవర్నర్ పర్యటన ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ సేధుమాధవన్ తెలిపారు. కాగా, స్నాతకోత్సవంలో ప్రత్యక్షంగా 275 మంది డిగ్రీ పట్టాలను గవర్నర్ నుంచి అందుకోనున్నారని వీసీ సుందరవల్లి తెలిపా రు. పరోక్షంగా పోస్టు ద్వారా 3,361 మందికి డిగ్రీ పట్టాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.



రైల్వే స్టేషన్‌లో గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ సుందరవల్లి

గవర్నర్‌కు ఘనస్వాగతం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మంగళవారం రాత్రి నెల్లూరుకు చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, విక్రమసింహపురి వైస్ చాన్సలర్ సుందరవల్లి, ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, మున్సిపల్ కమిషనర్ వికాస్ మర్మత్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌లు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్‌లో గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు.

వివాదాల నుంచి అభివృద్ధివైపు!

సింహపురీయుల దశాబ్దాల కల విక్రమ సింహపురి విశ్వవిద్యాలయాన్ని (వీఎస్‌యూ) సాధించుకున్నా అనేక వివాదాలు ఆ వర్సిటీని చుట్టిముట్టాయి. 2009లో వీఎస్‌యూ ప్రారంభమైనా సొంత భవనాలు లేకపోవడంతో అద్దె భవనాలు తీసుకున్నారు. నెల్లూరులో కళాశాల ఒకచోట, వసతి గృహాలు మరోచోట, పరిపాలన భవనాలు ఇంకోచోట ఉండేవి. బోధనేతర సిబ్బంది నియామకాలలో అవకతవకలు, భోజన వసతుల ఏర్పాట్లపై విద్యార్థుల ఆందోళనలు జరిగాయి. అయితే, గడిచిన రెండేళ్లుగా వర్సిటీలో అభివృద్ధి జోరందుకుంది. తొలిప్రయత్నంలోనే 'న్యాక్' ఏ గ్రేడ్ రావడంతో వర్సిటీ అధికారుల్లో ఆనందం వెల్లివిరిసింది. బుధవారం వర్సిటీ 8, 9 స్నాతకోత్సవాలు జరగనున్నాయి.

ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం

- వడివడిగా అడుగులువేస్తున్న వీఎస్‌యూ
- తొలిప్రయత్నంలోనే 'న్యాక్' ఏ గ్రేడ్ గుర్తింపు
- ఉన్న సమస్యలు పరిష్కరిస్తే మరింత మెరుగు
- నేడు 8, 9 స్నాతకోత్సవాలు



వెంకటాచలం, మే 21 : కాకుటూరు వద్ద 2012లో రూ.23 కోట్లతో విక్రమ సింహపురి యూనివర్సిటీకి శాశ్వత భవనాల నిర్మాణం మొదలైంది. భవన నిర్మాణాలు పూర్తయినా కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో వాటిని వర్సిటీకి అప్పగించలేదు. యూనివర్సిటీ అధికారులు పట్టించుకోవడం లేదంటూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. 2017లో అనాటి టీడీపీ ప్రభుత్వం స్పందించి మంత్రి గంటా శ్రీనివాస్ రావు, విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి ఆదిత్యనాథ్ దాసు స్వయంగా నెల్లూరుకు వచ్చి పరిస్థితిని సమీక్షించారు. ఆ వెంటనే సొంత భవనాల్లోకి వర్సిటీ మారింది. అయితే భవనాలు నాణ్యతగా లేవని, పగుళ్లు వస్తున్నాయని విద్యార్థులు ఆందోళన చేయడంతో ప్రభుత్వం ప్రత్యేక విచారణ కమిటీని కూడా ఏర్పాటు చేసింది.

పరీక్షల నిర్వాహణపై ఎన్నో ఆరోపణలు

యూనివర్సిటీ పరీక్షల నిర్వాహణ వ్యవహారంలో అనేక ఆరోపణలు ఎదుర్కొంది. వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కూడిన పరీక్షల నిర్వాహణలో వీఎస్‌యూ వైఫల్యం చెందిందని విద్యార్థి సంఘాలు గగ్గోలు పెట్టాయి. గతంలో పనిచేసిన ఓ పరీక్షల నియంత్రణాధికారి వ్యవహార శైలిపై విద్యార్థులు సుదీర్ఘ పోరాటాలు చేశారు. చివరకు వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించి సదరు అధికారిని తొలగించాల్సి వచ్చింది. కాగా వర్సిటీ ఏర్పాటై 13 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో వసతులు లేవు. గడిచిన రెండేళ్లలో వర్సిటీలో అభివృద్ధి కార్యక్రమాలు ఎంతోవేగంగా జరుగుతున్నాయి. యూనివర్సిటీలో మొన్నటి వరకు సరైన క్రీడా మైదానం లేకపోగా ఇటీవల క్రీడామైదానాన్ని అభివృద్ధి చేశారు. ఆ క్రీడామైదానాన్ని మరింత అభివృద్ధి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

వీడని సమస్యలెన్నో..

యూనివర్సిటీలో పూర్తిస్థాయిలో భవనాలు లేవు. వర్సిటీలో ఇప్పటివరకు ఓపెన్ డిగ్రీ కోర్సు ఏర్పాటు చేయలేదు. నెల్లూరులో మినహాయించి ఎక్కడా లా కోర్సు కళాశాల లేదు. లా కోర్సును వర్సిటీలో పెట్టినట్లయితే జిల్లా అభివృద్ధికి, లా కోర్సు చేసే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. క్రీడామైదానంలో ఆడిటోరియం ఏర్పాటు చేసినట్లయితే క్రీడాభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటుంది. నిర్మాణంలో ఉన్న పరీక్ష భవనాన్ని త్వరతిగతిన పూర్తి చేయాల్సి ఉంది. వర్సిటీ ప్రాంగణంలో మరో శుద్ధిజల కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లయితే తాగునీటి సమస్య తలెత్తే అవకాశమే ఉండదు. జాతీయ రహదారి వద్ద విద్యార్థుల కోసం బస్ స్టాప్ నిర్మించాలి. హైవే నుంచి వర్సిటీలోకి రాకపోకల కోసం ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయాలిన ఉంది. సిటీ బస్సుల రాకపోకలను కూడా వర్సిటీ వరకు కొనసాగిస్తే ఇటు విద్యార్థులకు, అటు వర్సిటీ సిబ్బందికి ఉపయుక్తంగా ఉంటుంది. వర్సిటీలో ఉన్న ఇంజనీరింగ్, ఫార్మా కోర్సుల కళాశాలలను మర్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. వర్సిటీలో ఉన్న సిబ్బంది కొరతను అధిగమించాలి. విక్రమ సింహపురి యూనివర్సిటీకి అనుసంధానంగా ఉన్న కావలిలోని వర్సిటీ పీజీ సెంటర్‌ను కూడా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.

● రెండేళ్లలో అభివృద్ధి పథంలో...

గడిచిన రెండేళ్లలో వర్సిటీ ఉపకులపతి సుందరవల్లి, రిజిస్ట్రార్ డాక్టర్ రామచంద్రా రెడ్డి సారథ్యంలో చాలా వరకు అభివృద్ధి పథంలో నడుస్తోంది. 2023లో తొలియత్నం లోనే వీఎస్‌యూ న్యాక్‌లో ఏ గ్రేడ్ సాధించింది. న్యాక్ గ్రేడ్ సాధించడంతో వర్సిటీకి వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థల నుండి పరిశోధన, బోధన అభివృద్ధికి నిధుల కేటాయింపు నకు మార్గం సుగమం అయ్యింది. జాతీయ నూతన విద్యా విధానం అమల్లోకి వచ్చిన తరుణంలో న్యాక్ గ్రేడ్ వల్ల స్వయం ప్రతిపాదిక కోర్సుల నిర్మాణానికి ఉపయోగకరంగా మారింది. దూరవిద్యా కేంద్రం కోర్సుల నిర్మాణం స్వతహాగా చేసుకునేందుకు అవకాశం లభించింది. న్యాక్ ఏ గ్రేడ్ ఐదేళ్లపాటు అమల్లో ఉంటుంది.

కుక్క కాటుతో వ్యక్తి మృతి

- సంగంలో ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



క్రిష్టయ్య (ఫైల్)

సంగ, మే 21: స్థానిక సాయినగర్‌కు చెందిన నక్కా క్రిష్టయ్య (41) కుక్క కాటుతో కోలుకోలేక మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల మేరకు.. మండలంలోని తరుణవాయి గ్రామానికి చెందిన నక్కా క్రిష్టయ్య కొన్ని సంవత్సరాల కిందట నుంచి కుటుంబసభ్యులతో కలిసి సంగంలోని సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. పందులు మేపుకుని జీవనం సాగించే ఈయన గత నెల 24వ తేదీన కుక్క కాటుకు గురైయ్యాడు. కుటుంబసభ్యులు అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ఈ నేపథ్యంలో మే 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో సంగంలో ఓటు హక్కు వినియోగించుకున్నాడు. 18వ తేదీన రాత్రి ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య సుజాత, నలుగురు సంతానం. వారిలో కుమార్తె, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబసభ్యులు వీధిన పడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం



నెల్లూరు(క్రైం), మే 21: నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలో మంగళవారం రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రేల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ఆకుపచ్చ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కార్డన్ సెర్చ్‌లో 31 బైక్‌ల స్వాధీనం

నెల్లూరు(క్రైం), మే 21: జిల్లా వ్యాప్తంగా చిన్నబజారు, ఉదయగిరి, జలదంకి పోలీసు స్టేషన్ల పరిధిలో మంగళవారం నిర్వహించిన కార్డన్ సర్చ్ ఆపరేషన్‌లో సరైన పత్రాలు లేని 31 బైక్‌లు, ఒక ఆటో ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ మాట్లాడుతూ ప్రత్యేక కార్యా చరణ ద్వారా జిల్లాలో హింసాత్మక చర్యలు అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, చట్టవ్యతిరేక కార్యకలాపాలు అణచివేత, దొంగతనాల నివారణ, అసాంఘిక శక్తుల ఏరివేతే కార్డన్ సర్చ్ ఉద్దేశమన్నారు.

ఐదు మోటార్ల చోరీ

బుచ్చిరెడ్డిపాలెం, మే 21: బుచ్చి పెద్దూరు దళితవాడలో ఇటీవల పలు ఇళ్లలోని ఐదు మోటార్లు చోరీకి గురయ్యాయి. దొంగతనాలపై దృష్టి సారించిన స్థానికు లు ఓ అనుమానితుడిని పోలీసులకు పట్టించారు. ఈ మేరకు వారు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ హంట్‌తో 600 ఫోన్ల రికవరీ

- బాధితులకు అందజేత : ఎస్పీ ఆరీఫ్ హఫీజ్



బాధితులకు ఫోన్లు అందిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 21: మొబైల్ హంట్ ద్వారా ప్రజలు పోగొట్టుకున్న రూ.1.50 కోట్ల విలువ చేసే 600 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. వాటిని జిల్లా ఎస్పీ కే. ఆరీఫ్ హఫీజ్ మంగళవారం నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేస్తూ పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్లను తిరిగి అందజేస్తున్నామన్నారు. పోలీసు స్టేషన్‌కు వెళ్లకుండా, ఎఫ్ఐఆర్ నమోదు కాకుండా కేవలం వాట్సాప్ మెసేజ్ ద్వారా జిల్లా పరిధిలో చోరీ, మిస్ అయిన సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు ఇస్తున్నామన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన మొబైల్ హంట్ వాట్సాప్ నెంబరు 9154305600 ద్వారా అతి తక్కువ కాలంలో రూ.కోట్ల విలువ చేసే ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటి వరకు ఆరు విడతల్లో సుమారు రూ.5.85 కోట్ల విలువ చేసే 2,320 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సుమారు రూ.7.5 లక్షల విలువ చేసే 36 మొబైల్స్ బాధితులకు అందజేశామన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో శ్రమించిన సైబర్ క్రైమ్ అనాలిసిస్ బృందాన్ని, పోలీస్ స్టేషన్ పరిధిలోని సిబ్బందిని అభినందించారు. మొబైల్ హంట్‌కు దరఖాస్తు చేసుకున్న మిగిలిన వారి మొబైల్స్‌ను కూడా రికవరీ చేసి బాధితులకు అందజేస్తామన్నారు. సరైన బిల్లులు లేని కొత్త, సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లను ప్రజలు కొనవద్దని సూచించారు. పోగొట్టుకున్న ఫోన్‌లు రికవరీ చేసి అందజేయడంతో బాధితులు ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు.

ఓవర్‌లోడ్ ఫీడర్లను వెంటనే సరిచేయండి

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), మే 21: నెల్లూరు నగరంలో ఓవర్‌లోడ్ ఫీడర్లను గుర్తించి, అధిక లోడ్ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ అధికారులను ఆదేశించారు. టౌన్ డివిజన్ అధికారులతో ఆయన చాంబర్‌లో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో అధికంగా వినియోగదారులు ఏసీలను వినియోగిస్తున్నం దున, ఫీడర్లపై అదనపు లోడ్ పడుతుందని, వాటన్నిం టని గుర్తించి, అవసరమైన అదనపు పరికరాలను ఏర్పాటు చేయాలన్నారు. సీసీ రోడ్లవల్ల నగరంలో ట్రాన్స్ ఫార్మర్ల దిమ్మెలు ఎత్తు తగ్గిఉంటే వెంటనే ఎత్తు పెంచాలన్నారు. విద్యుత్ లైన్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎక్కడైనా అంతరాయాలు ఏర్పడితే, ప్రతి సెక్షన్‌లో టోల్‌ఫ్రీ నంబర్, ఫీజ్ ఆఫ్ కాల్ నెంబర్లు ఏర్పాటు చేసి ఉన్నందున, వినియోగదారులు అవసరమైతే వాటికి ఫిర్యాదు చేసేలా చైతన్యపరచాలన్నారు. ఈ సమావేశంలో ఈఈ సోమశేఖర్ రెడ్డి, డిఈలు మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	172
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	300
స్కిన్‌లెస్	330
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7046
వెండి కిలో ధర	రూ. 95,700
వెండి ఒక గ్రాము	రూ. 97.70

ఇంటర్, టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- ఈనెల 24 నుంచి 3వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లా రెవెన్యూ అధికారి లవన్న



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్వో లవన్న

నెల్లూరు (విద్య), మే 21 : ఇంటర్, టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికారులంతా సమన్వయంతో పని చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) లవన్న తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. ఈ నెల 25 నుంచి జూన్ 3వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 39 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా 7,083 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే 24 నుంచి జూన్ 1వతేదీ వరకు జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 51 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 25,890 మంది హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులంతా పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో అధికారులు, సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలీస్‌శాఖ సమన్వయంతో భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు.

● 1 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

జూన్ 1 నుంచి 8వ తేదీ వరకు ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డీఆర్‌ఓ తెలిపారు. జిల్లాలో మూడు కేంద్రాల్లో టెన్త్‌ను, నాలుగు కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ డాక్టర్ ఎ.శ్రీనివాసులు, డీఈవో రామారావు, డీపీఓ సుస్మిత, జడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ డీఓలు లక్ష్మీప్రసన్న, రఘురామయ్య, ప్రసాద్‌రావు, గోపాల్, డీవీఈఓ మధుబాబు, ఇంటర్ డీఈసీ సభ్యులు దీనదయాల్, వేణుగోపాల్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో రెండో విడత కౌన్సెలింగ్

- ఇంటర్ అన్ని గ్రూపుల్లో మిగిలిన సీట్లు 200
- అర్హతను బట్టి ఎంపిక



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సంగం, మే 21: స్థానిక బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఉమ్మడి జిల్లాలోని అన్ని గురుకులాల్లో ఇంటర్ ప్రవేశాలకు మంగళవారం రెండోవిడత కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటివిడతలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరగా 200 సీట్లు మిగిలిపోయాయి. ఆ సీట్ల భర్తీ కోసం గురుకులాల జిల్లా కన్వీనర్ హేమలత ఆధ్వర్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టారు.

కామాక్షితాయి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమావేశం



కామాక్షితాయి బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిఆస్తున్న ఆర్డీవో, ఆలయ ఈవో, తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం,మే 21: మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఈనెల 28నుంచి నిర్వహించే కామాక్షితాయి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో మలోలా అధ్యక్షతన వివిధ శాఖల అధికారుల సమన్వయ సమావేశం నిర్వహించినట్లు ఆలయ ఈవో వీ గిరికృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా బ్రహ్మోత్సవాల గోడపత్రిక, కరపత్రాలను ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు, 24 గంటలు విద్యుత్ సరఫరా, పోలీసు బందోబస్తు, వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆర్డీవో సూచించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో దేవదాయశాఖ అధికారి జంజనం శ్రీనివాస్, పోలీసు, రెవెన్యూ, వైద్యశాఖ, ఇరిగేషన్, ఎక్సైజ్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారని తెలిపారు.

● అందని ఆహ్వానం

సమన్వయ సమావేశానికి జొన్నవాడ గ్రామ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాల్సి ఉంది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని ఆలయ ఈవో తెలిపారు. కానీ క్షేత్ర స్థాయిలో పనులు చక్కదిద్దే గ్రామ పంచాయతీ అధికారికి ఆహ్వానించకపోవడం చర్చనీయాంశమైంది.

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లకు పాల్పడవద్దు

మత్స్యకారులు అన్నదమ్ముల్లా కలిసుండాలి : ఎస్పీ

బిట్రగుంట(అల్లూరు), మే 21: త్వరలో వెలువడనున్న ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా, శాంతి భద్రతలకు సహకరించాలని, అల్లర్లకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ అన్నారు. బోగోలు మండలం జువ్వలదిన్నెలో మంగళవారం కావలి రూరల్, బోగోలు, అల్లూరు, విడవలూరు మండలాలకు చెందిన మత్స్యకార గ్రామాల కాపులు, మత్స్యకార నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల ఫలితాల గురించి ఎవరైనా గ్రామాల్లో సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా, అల్లర్లకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. చదువుకున్న యువకుల కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. తీరప్రాంత గ్రామవాసులు కష్టజీవులని, ఎవరూ మత్స్యకార కుటుంబాలను పోషించడం లేదనే విషయాన్ని గమనించాలన్నారు. అల్లర్లు, కొట్లాటలకు పాల్పడితే తమ కుటుంబాల్లో ఏర్పడే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయని, ఆ సమయాల్లో ఎవరూ మీకు సహాయ పడరనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మత్స్యకార ప్రాంత ప్రజలు అన్నదమ్ముల్లా మెలగాలని కోరారు. ప్రతిఒక్కరూ వచ్చే నెల 4న అప్రమత్తంగా ఉండి, ఎవరి పనుల్లో వారు ఉండాలని ఆయన సూచించారు. అల్లర్లు జరిగితే గ్రామాల్లో 144 సెక్షన్ అమలు చేస్తామని, పికెట్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న, కావలి డీఎస్పీ వెంకటరమణ, సీఐలు శ్రీనివాసరావు, నాగభూషణం, రాజేష్, ఎస్ఐలు భోగ్యానాయక్, మరిడినాయుడు, శ్రీనివాసులు రెడ్డి, అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, హాజరైన మత్స్యకారులు

బీసీ వసతి గృహాల్లో 100% ప్రవేశాలు జరగాలి

- జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య

నెల్లూరు(వీఆర్సీ), మే 21: ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో నూరు శాతం విద్యార్థులను చేర్పించే బాధ్యత వార్డెన్‌లదేనని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం వార్డెన్‌లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1నుంచి హాస్టల్ ఉన్న పరిధిలోని గ్రామాలలో విరివిగా ప్రచారం నిర్వహించి విద్యార్థులు హాస్టల్ బాట పట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్టల్ వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు హాస్టళ్లలో చేర్పిస్తే వచ్చే ప్రయోజనాలు వివరించాలన్నారు. 10వ తరగతిలో ఫెయిలైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేలా చూడాలన్నారు. ఇంటర్‌లో ప్రవేశించే విద్యార్థులకు కళాశాల వసతిగృహంలో ఉచిత వసతి, భోజనం ప్రభుత్వం అందిస్తుందని, ఎక్కడెక్కడ కళాశాల వసతిగృహాలు ఉన్నాయో వారికి తెలియజెప్పి అడ్మిషన్ ఇప్పించాలన్నారు. ఇవన్నీ పాటిస్తేనే హాస్టల్‌లు పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అవుతాయని, తద్వారా వసతిగృహాలు బలోపేతం చేసినవారమవుతామన్నారు. ప్రభుత్వ భవనాలలో కొద్దిపాటి మరమ్మతులు స్థానిక దాతల ద్వారా చేయించుకోవాలన్నారు. ప్రైవేటు భవనాలలో ఉన్న వసతిగృహాలలో మైనర్ రిపేర్లు గుర్తించి భవన యజమానితో చేయించాలన్నారు. కళాశాల విద్యీర్థులు వసతిగృహాల్లో లేకుంటే వసతి దీవెన అందదన్నారు. పెండింగ్ ఉన్న విద్యార్థుల జాబితా ప్రకారం ఆయా సచివాలయాలలో అప్‌డేట్ చేయించి వారికి విద్యా దీవెన అందేలా కృషి చేయాలన్నారు.

టెన్జింగ్ నార్వే జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(వీఆర్సీ), మే 21 : టెన్జింగ్ నార్వే జాతీయ సాహస అవార్డు-2022 కోసం 2021, 2022, 2023 సంవత్సరాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సెట్నెల్ సీఈవో వై వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మూడేళ్ల కాలంలో భూమి, సముద్రం, గాలి (వాయు)పై సాహస కార్యకలాపాలకు ఒక్కొక్క అవార్డు, సాహస రంగంలో జీవితకాల సాధన కోసం ఒక అవార్డుకు అత్యుత్తమమైన విజయాలు సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్://అవార్డ్స్‌జీవోవీ.ఇన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. అర్హులైన వారికి భారత రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులను బహూకరిస్తారని పేర్కొన్నారు. గ్రహీతలకు టెన్జింగ్ నార్వే కాంస్య విగ్రహంతోపాటు ప్రశంసా పత్రము, బ్లేజర్, రూ.15 లక్షలు అందజేస్తారని పేర్కొన్నారు.

అనారోగ్యాలకు కేరాఫ్.. ఖాళీ ప్లాట్లు



ఆత్మకూరు : జేఆర్‌పేటలో ఉన్న ఖాళీ స్థలంలో నిలిచిన మురుగునీరు

- ఆత్మకూరు ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు
- డంపింగ్ యార్డులు.. మురుగు గుంతలకు ఆవాసం
- విష కీటకాలు, దోమలకు నిలయంగా మారిన వైనం
- విష జ్వరాలు ప్రబలుతాయన్న ఆందోళనలో జనాలు

ఆత్మకూరు, మే 21: స్థానిక మున్సిపాలిటీలోని జేఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీప ప్రాంతాల్లో నివాసం ఉండే ఇళ్లు ఉన్నాయి. ఈ ఇళ్ల మధ్య లో అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ స్థలం యజ మాను ల పర్యవేక్షణ లేకపోవడంతో అవి డంపింగ్ యార్డులుగా దర్శనమిస్తున్నాయి. దానికితోడు ఇళ్లలోని వాడిన నీరంతా ఖాళీ స్థలాల్లో నిలిచి మురుగు గుం తలుగా మారుతున్నాయి. వాటిలో పిచ్చిమొక్కలు, కంపచెట్లు పెరుతున్నా యి. అంతటితో ఆగక వాటిలో వాడేసిన కొబ్బరి బొండాలు, విరిగిపోయిన ప్లాస్టిక్ సామగ్రి, పాత టైర్లు వంటివన్నీ పారవేస్తున్నారు. వర్షం పడగానే వాటిలో నీ రు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వ్యాధులకు కారణమయ్యే దోమ లు ప్రబలుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వం టి జ్వరాల బారినపడిన బాధితు లు ఉన్నారు. ఈ క్రమంలో ము న్సి పల్ అధికారులు ఇప్పటికే పలు మార్లు ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోవడం లేదు.



ఎస్ఆర్‌పల్లిలోని ఖాళీ స్థలంలో పెరిగిన కంపచెట్లు

700 ఖాళీ స్థలాలు

మున్సిపాలిటీ పరిధిలో 23వార్డు లుంటే ఖాళీస్థలాలు 700లకు పైగా ఉన్నాయి. వీటిలో అధికారికంగా 280స్థలాలను గుర్తించారు. గుర్తింపు లేని ఖాళీస్థలా లు మరో 500కి పైగా ఉన్నాయి. ఇటీవల అధికారులు పారిశుధ్యం మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగానే ఖాళీ జాగాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇలా చేస్తే మున్సిపాలిటీలో పారిశుధ్యం మరింత మెరుగుపడుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

కోర్టు ఆదేశాలు బేఖాతరు

ఖాళీ స్థలాలను చదును చేయించి పిచ్చిమొక్కలు మొలవకుండా, మురు గునీరు నిల్వ ఉండకుండా, చెత్త వ్యర్థాలు ఖాళీ స్థలాల్లో పారవే యకుండా ఉంచాలని కోర్టు ఆదేశించింది. అలా చేయని ఖాళీస్థలాల యజమా నులకు రూ.1000లు జరిమానా విధించాలని ఉత్తర్వులు సైతం మున్సిపల్ అధికా రులకు జారీ చేసింది. కానీ ఈ ఆదేశాలు ఎక్కడ అమలు కావడం లేదు.

ప్రబలుతున్న జ్వరాలు

దోమలతో విష జ్వరాలు వచ్చిన ప్పుడే హడావుడి చేసే వైద్య, మున్సి పల్ శాఖల అధికారులు శాశ్వత నియంత్రణపై శ్రద్ధ చూపడం లేదు. దోమల కారక లార్వాలు ఖాళీ స్థలా ల్లోని మురుగునీటిలో అలాగే ఉండి పోతున్నాయి. వాతావరణంలో మా ర్పులు రాగానే విజృంభిస్తున్నాయి. శాశ్వత ప్రాతిపదికన చర్యలు ఉండడం లేదు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతారామపురం, మే 21: ఉదయగిరి నుంచి సీతారా మపురం మార్గంలోని 33కేవీ ఫీడర్ లైన్ మరమ్మతు పను ల్లో భాగంగా బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అం తరాయం కలుగనున్నట్లు విద్యుత్‌శాఖం మండల ఏఈ శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా కోరారు.

డీసీపల్లి బోర్డులో పొగాకు ధరలు

మర్రిపాడు. మే 21: డీసీపల్లి పొగాకు బోర్డు ధరలు రైతుల్లో రోజురోజుకు ఆశలు కల్పిస్తున్నాయి. ఎప్పుడూ చూ డని విధంగా మంగళవారం ధరలు పలికాయి. బోర్డుకు రైతులు 832బేళ్లను తీసుకెళ్లగా 18కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 796బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కా రణాలతో 36బేళ్లను తిరస్కరించారు. కిలో గరిష్ట ధర రూ.320.. కనిష్ట ధర రూ.205.. సగటు ధర రూ.279.03గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు.

మండల సమావేశం వాయిదా

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మే 21: స్థానిక మండల కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో సురేష్‌బాబు తెలిపారు. ఈ సమా వేశానికి ప్రజాప్రతినిధులు హాజరు కాలేదన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామన్నారు.

సీడీపీవో ఆకస్మిక తనిఖీలు

కలువాయి, మే 21: మండల సెక్టారులోని అంగన్ వాడీ కేంద్రాలను మంగళవారం రాపూరు ఐసీడీఎస్ సీడీపీ ఓ సునంద ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ నెల 1వ తేదీ నుంచి కేంద్రాల్లో ఒకపూట నిర్వహిస్తున్నారు. అయితే పలు అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా తెరుచుకోకపోవడం, తెరిచినా విద్యార్థులకు పౌష్టికాహారం అందడం లేదన్న పత్రికల్లో వచ్చే కథనాలపై స్పందించినట్లు తెలిపారు.

త్వరితగతిన పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంఈవోలు

ఉదయగిరి రూరల్, మే 21: మండలంలో జరుగు తున్న మనబడి నాడు-నేడు పథకం కింద జరిగే రెండో విడత పనులను ఈ నెల చివరినాటికి పూర్తి చేయాలని ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీనివాసులు సూచించారు. మం గళవారం అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని వారు పరిశీలించారు. టాయిలెట్స్, తరగతి గదులు, ఎలక్ట్రిషి యన్ పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, పీఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలజడులు సృష్టిస్తే చర్యలు తప్పవు



బసినేనిపల్లిలో స్వాధీనం చేసుకున్న వాహనాలు

సీతారామపురం, మే 21: బసినేనిపల్లి, ఎస్ఆర్‌నగర్, సింగ రెడ్డిపల్లి, చిన్ననాగంపల్లి గ్రా మా ల్లో మంగళవారం సీఐ గిరిబాబు స్పెషల్ పార్టీ పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీఐ మాట్లాడారు. ఎన్ని కల కోడ్ అమలులో ఉన్నందున ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మే రకు ఈ తనిఖీలు చేపట్టామ న్నా రు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో ఎలాంటి అలజడులు సృష్టించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి గొడవలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తగా ఇళ్లు తనిఖీ చేశా మన్నారు. బసినేనిపల్లిలో ఎలాం టి ధ్రువీకరణ పత్రాలు లేని 9 ద్విచక్ర వాహనాలను స్వాధీ నం చేసుకున్నామని, వాటి పత్రాలు చూపించినట్లయితే తిరిగి ఇచ్చేస్తామన్నారు. కార్యక్రమంలో సీతారామపురం ఎస్ఐ అనూష, ఉదయగిరి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో ప్రయోజనకరం

చేజర్ల, మే 21: రసాయన ఎరువులు తగ్గించి సేంద్రియ, జీవ ఎరువులు వాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే భూసారంను పెంచుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం డీఆర్‌సీ లు చక్రవర్తి, వాసులు సూచించారు. మంగళవారం వారు చేజర్ల, మడపల్లి ఆర్బీకేల్లో రైతుల తో సమావేశమై భూసార పద్ధతులపై అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకు ని పూతదశలో ఉన్నప్పుడు దున్నుకుని భూసారం పెంచుకోవాలన్నారు. జీలగ, జనుము, పిల్లిపెస ర విత్తనాలు 50శాతం సబ్సిడీతో అందజేస్తామని తెలిపారు. జీలగ, జనుము కేజీ రూ.44, పిల్లి పెసర విత్తనాలు కేజీ రూ.67లకు అందజేస్తామని, కావలసిన రైతులు ఆర్బీకేల్లో పేర్లు రిజిస్ట్రే షన్ చేయించుకోవాలని కోరారు. ఏఓ శశిధర్, ఏఈవో వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఎస్.వెంకటసుబ్బారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 50శాతం సబ్సిడీపోను 10కేజీల జీలుగలు, జనుములు రూ.440లకు, 8కేజీల పిల్లిపెసర్లు రూ.536లకు పంపిణీ చేస్తామన్నారు. ఎకరాకు ఒక సంచి పచ్చిరొట్ట విత్తనాల చొప్పున ఐదెకరాల వరకు అందజేయనున్నట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆయా రైతుభరోసా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ఉచిత ఒడుగుల కార్యక్రమం

ఆత్మకూరు, మే 21: స్థానిక త్రికోటేశ్వర కల్యాణ మండపంలో ఆవాజ్ కమిటీ సభ్యులు మంగళవారం ముస్లిం చిన్నారులకు ఉచిత ఒడుగుల (ఖత్నా) కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సోమశిలలో 7.665 టీఎంసీలు

అనంతసాగరం, మే 21: సోమశిల జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారానికి 7.665 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికా రులు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, మే 21: పట్టణం లోని శాఖా గ్రంథాలయంలో మంగ ళవారం నిర్వహించిన వేసవిశిక్షణ శిబిరంలో విద్యార్థులతో పుస్తక పఠ నం చేయించారు. గ్రంథాలయ అధి కారి షేక్ ఫజులుల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు, ఆంగ్ల పాఠ్యపుస్తకాల్లోని కొన్ని పేరా లను చూచి రాసే పోటీలు నిర్వ హించారు. జూన్ 7న ముగింపు సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అంద జేస్తామని తెలిపారు.

అనంతసాగరం: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ నారాయణ రావు తెలిపారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పుస్తకపఠం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం



కలువాయి: పరమానంద ఆశ్రమంలో లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కలువాయి, మే 21: రాజుపాలెం సమీపంలోని పరమానంద ఆశ్రమం లో నరసింహస్వామి జయంతిని పుర స్కరించుకుని మంగళవారం స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి అభిషే కం, స్నపన, తిరుమంజనం, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదా లు అందజేశారు. ఉభయకర్తలుగా రా జుపాళెంకు చెందిన నందిమండలం పృథ్వీరాజ్‌వర్మ, ఉషారాణి, నంది మం డలం ప్రణీత్‌వర్మ షాలిని దంపతులు వ్యవహ రించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఈ దూరు రామాచార్యులు, పరమానంద ఆశ్రమం జీ యర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ వేమారెడ్డి రఘునందనరెడ్డి పాల్గొన్నారు.

కోన భక్తులకు అన్నదానం

పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్స వాల సందర్భంగా కోనకు వెళ్లే భక్తులకు దాచూరు గ్రామస్థులు అన్నదానం చేశారు. ఈ నెల 24వ తేదీ వరకు భక్తులకు అన్నదానం, నిమ్మరసం ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఉదయగిరి రూరల్: పప్పులవారిపల్లిలో మంగళవారం సీతారాములస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ శుద్ధి, గణపతి పూజ, కలశ స్థాపన, పుణ్యాహవచనం, స్వామివారి మూల విరాట్‌కు అభిషేకం, ప్రత్యేక అలంకరణలు, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఆయా పూజా కార్యక్రమాలకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

సీతారామపురం: పండ్రంగి గ్రామ సమీపం లోని వెలసిన పాండురంగ విఠలేశ్వర స్వామి బ్ర హ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహన సేవ నిర్వహించారు. సింగరెడ్డిపల్లి గ్రా మం నుంచి గరుత్మండుని ట్రాక్టర్‌పై ఉంచి డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.



దాచూరులో కోన భక్తులకు అన్నదానం



పప్పులవారిపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఉపాధి పనుల్లో సౌకర్యాల మృగ్యం

- మండుటెండలో కూలీలు
- తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ ఊసేలేదు
- కనిపించని టెంట్లు, మెడికల్ కిట్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కాకుటూరులో షామియానా లేక చెట్లకింద సేద తీరుతున్న ఉపాధి కూలీలు

వలేటివారిపాలెం, మే 21 : కూలీల వలసల నిరోధానికి, ఉన్న గ్రామం లోనే పనులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని అ మలు చేస్తున్నది. దీన్ని విజయవంతంగా చేపట్టేందుకు నూతన సాంకేతి కతను అమల్లోకి తీసుకొచ్చింది. కూలీల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకు నేందుకు నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం విధానాన్ని ప్రవేశ పెట్టింది. వచ్చిన వారి ఫొటోను ఉదయం పని ప్రదేశం నుంచే తీసి పోర్టల్‌లో నమో దు చేయడం, పని పూర్తయిన తరువాత మళ్లీ ఫొటో తీసి నిక్షిప్తం చేయడం వంటి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. అలాగే గతంలో రోజుకు రూ.272 కూలీ ఇచ్చేవారు. ప్రస్తుతం రూ.300 చేశారు. అంతా బాగానే ఉన్నా కూలీ లకు కనీస సౌకర్యాలు కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండ లంలోని 21 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం 4,200 మంది కూలీలు పనిచే స్తున్నారు. పలు గ్రామాల్లో పని ప్రదేశంలో కూలీలు అలసిపోయి సేద తీర్చు కునేందుకు షామియానాలు లేవు. దీంతో వారు సేదతీరడానికి చిల్లచెట్లను ఆశ్రయించాల్సి వస్తున్నది. తాగునీరు లేక కూలీలే సీసాలతో ఇంటి నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. కూలీలు అలిసిపోయి సొమ్మసిల్లి పడిపోతే ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వడం లేదు. పనిచేసే సమయంలో ప్రమాదవశాత్తు గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు ఫస్ట్‌ఎయిడ్ బాక్సులు కూడ అందు బాటులో లేవు. మౌలిక వసతులు పూర్తిగా విస్మరించడంతో కూలీలు ఇబ్బం దులు పడుతున్నారు. అంతేకాక ఉపాధి పనుల్లో అధికారుల పర్యవేక్షణ కొర వడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పని ప్రదేశాల్లో కూలీ లకు వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

చెత్తాచెదారంతో నిండిన రైతుబజారు



రైతుబజారు ప్రధాన ద్వారం వద్ద పేరుకుపోయిన చెత్త

కావలి, మే21: పట్టణ నడిబొడ్డున ఉన్న రైతుబజారు ప్రధాన ద్వారం వ ద్ద చెత్తాచెదారం కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో రైతుబజారులో ముం దుభాగాన నేలపై కూర్చుని వ్యాపారాలు చేసుకునే మహిళలు, కూరగాయల కొనుగోలుకు వెళ్లే ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. గతంలో రోజు మార్చి రో జు అక్కడ చెత్తను మున్సిపాలిటీ వారు తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఐదారు రోజు లకు ఒక్కసారి చెత్త తీసుకెళ్లుతున్నందున అక్కడ దుర్గంధం వెదజల్లుతోందని చెబుతున్నారు. ఈ దుర్గంధం వల్ల రోగాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున అక్కడ చెత్తను గతంలో లాగా రోజు మార్చి రోజుకానీ, వీలుంటే నిత్యం కాని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

లింగసముద్రం, మే 21: పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్య వసాయ అధికారి టీ అబ్రహంలింకన్ తెలిపారు. మం గళవారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని ఆర్ బీకేల్లో పీఎం ప్రణామ్ కార్యక్రమం కింద రైతులకు భూ సార పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వీఏఏలు శ్రీనివాసులు, ఇమ్రాన్ నజీర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లింగసముద్రం, మే 21 : మండలంలోని వీఆర్ కోట గ్రామ సమీపంలోని మన్నేరు నుంచి మంగళవారం తె ల్లవారుజామున ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ మల్లికార్జునరావు సిబ్బంది తో దాడి చేసి ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

514 పొగాకు బేళ్లు కొనుగోలు

కలిగిరి, మే 21: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మం గళవారం రైతులు మొత్తం 550 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 16కంపెనీల ప్రతినిధులు పాల్గొని 514బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-13, సీఆర్-11, జంపింగ్ లాట్స్-12 కారణాలతో 36బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.314, కనిష్ఠ ధర రూ.205, స గటు ధర రూ.262.05గా నమోదైనట్లు వేలం నిర్వహణా ధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కందుకూరు, మే 21: గుడ్లూరు మండలం చేవూరు వద్ద చెరువు భూమిని ఆక్రమించి నిర్మించిన రామదూత స్వామి ఆశ్రమంలో ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకో వాలని, రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జారీచేసిన ఆదే శాలను అమలుచేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అ ధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఏపీ హే తువాద సంఘం అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మం గళవారం ఒక ప్రకటనలో కోరారు. దొంగస్వామి ఇచ్చే ము డుపులకు ఆశపడి గుడ్లూరు తహసీల్దార్ ప్రిన్సిపల్ సెక్రట రీ ఆదేశాలను బుట్టదాఖలు చేయగా జిల్లా కలెక్టరు సైతం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారుల బాధ్యతారాహిత్యంపై ఇటీవల సీసీఎల్ఏకు కూ డా ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టరుపై చర్యలు తీసుకుని గుడ్లూరు తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాల్సిందిగా సీసీఎల్ఏకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న పారిశుధ్య కార్మికులు

కావలిటౌన్ : బకాయిపడిన జీతాలు, అలవెన్సులు చె ల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కు మార్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం కార్మిక సం ఘం గౌరవాధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ మున్సి పాలిటీలో పనిచేసే వందలాదిమంది పారిశుధ్య కార్మికు లను రెండు నెలలు జీతాలు, అలవెన్సులు, సంక్రాంతి బో నస్, సమ్మెకాలం జీతం వెంటనే చెల్లించాలని డిమాండ్ చే శారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చ రించా రు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అఖి లేష్, రమేష్, శ్రీనివాసులు, మహేష్, చిన్నమ్మ పాల్గొన్నారు.

దారుణంగా అల్లూరు ప్రధాన రహదారి



అల్లూరు బీసీ కాలనీ వద్ద ప్రధాన రహదారి దుస్థితి

అల్లూరు : రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు పునర్నిర్మాణం నేపథ్యంలో అల్లూరు బీసీ కాలనీ వద్ద రోడ్డు పరిస్థితి దా రుణంగా ఉంది. బాగున్న రోడ్డును ఇరువైపులా తవ్వేసి మ ళ్లీ పూడ్చారు. దీంతో ఆ ప్రాంతంలో గుంతలు ఏర్పడి వర్ష పునీరు, డ్రైనేజీ నీరు అక్కడ చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బం దిగా మారింది. రెండేళ్లుగా ఓవైపు దోమల సమస్య, మరో వైపు కాలనీలోకి రాకపోకలకు సమస్య ఏర్పడింది. ఈ విష యంపై పలుమార్లు అధికారులకు తెలుపుకున్నా తామేమీ చేయలేమని వారు సమాధానమిచ్చారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బందు లు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

కమనీయం శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న భక్తులు

లింగసముద్రం, మే 21 : స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పద్మా వతి సమేత శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా జరిగింది.ఈనెల 14 నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఈనెల 24తో ఇవి ముగుస్తాయి.ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు కల్యాణం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉభయ కర్తలుగా అడపా బ్రదర్స్ వ్యవహరించారు.

అత్యాచార బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

- ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత నేతల నిరసన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దళిత నేతలు

కావలి, మే 21: దళిత, గిరి జన అత్యాచార బాధితులకు వెంటనే నష్టప రిహారం ఇవ్వా లని దళిత సం ఘర్షణ సమితి జిల్లా అధ్యక్షు డు ఎస్. మల్లి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయం వద్ద దళితులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మల్లి మాట్లాడుతూ జిల్లాలో ఒకటిన్నర సంవత్సరంగా అత్యాచారాలకు గురైన బాధితులకు చెల్లించాల్సిన నష్టపరి హారం, ఎస్సీ, ఎస్టీ చట్టాల ద్వారా వచ్చే పరిహారం బాధితులకు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ఖజానాలో నిధులు లేవని చెపు తూ జాప్యం చేస్తున్నారన్నారు. వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కా ర్యక్రమంలో దేవరకొండ హజరత్తయ్య, మందా వెంకటేశ్వర్లు, ముక్కు మోహన్‌రావు, చౌటూరి లక్ష్మయ్య, జడ్డా వాసు, జరుగుమల్లి విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి వత్తాసు పలికారనడం అవాస్తవం..



విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నేతలు

కావలిటౌన్, మే21: జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి అళహరి సుధాకర్ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీకి వత్తాసు పలికారనడం అవాస్తవమని జనసేన నేతలు పేర్కొ న్నారు. మంగళవారం తుమ్మలపెంట రోడ్డులోని జనసేన కార్యాలయంలో టౌన్ కోర్డినేటర్ సుధీర్, రూరల్ అధ్యక్షుడు వెంకయ్య, అల్లూరు అధ్యక్షుడు పడకల నాని, దగదర్తి అధ్యక్షుడు వెంకట్‌యాదవ్, బోగోలు అధ్యక్షుడు వెంకటేష్ విలేకరులతో మాట్లాడారు. కొందరు జనసేన పట్టణ నాయకులు అళహరి సుధాకర్‌పై నిరాధార ఆరోపణలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. అళహరిపై అవాకులు,చెవాకులు పేలితే జన సైనికులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు చంటి, బాలు, అగస్టీన్, రాజేష్, లక్ష్మీ, సాహితి, హెలెన్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షఫీవుల్లా



షేక్ షఫీవుల్లాను సత్కరిస్తున్న ముస్లిం పెద్దలు

కావలిటౌన్, మే21: ముస్లిం హక్కుల పరిరక్ష ణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా షేక్ షఫీవుల్లా నియమితులయ్యా రు. దీంతో ఆయ న్ను మంగళ వా రం పట్టణంలో పలువురు మైనార్టీ ప్రముఖులు, మతపెద్దలు అభినందన సత్కారమందించారు. అనంతరం ముస్లిం పెద్దలు మాట్లాడుతూ షఫీవుల్లా మై నార్టీల అభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తున్నారని, వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా ముస్లిం ఆస్తుల పరి రక్షణకు పాటుపడ్డారన్నారు. షఫీవుల్లా మాట్లాడుతూ తనపై ఉంచిన బాధ్యతను సమర్థవం తంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో మతపెద్దలు జమీర్, సిరాజ్, ప్రొఫెసర్ హాజీ ఫైజుద్దీన్, దస్తగిరిబాష, నాగూరు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం : చేజెర్ల

నెల్లూరు(వైద్యం), మే 21 : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల సామాజిక ఆరోగ్య కేం ద్రంలో విధి నిర్వాహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దారుణమని ఏపీ హె ల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాక ర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బందిపై దాడులు చేసి కొట్టడమే కాకుండా ఫర్నిచర్, రికార్డులు ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి అరాచక శక్తులకు గుణపాఠం చెప్పాలని, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పడుగుపాడుకు శాపంగా రోడ్డు విస్తరణ

● బారికేడ్ల ఏర్పాటుతో గ్రామం రెండుగా విభజన ● ఆపై ప్రజలకు ఇక్కట్లు ● ఆందోళనలో స్థానికులు



పడుగుపాడులో రోడ్డు విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన బారికేడ్లు



పడుగుపాడు పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉంచిన బారికేడ్లు

కోవూరు, మే 21: జాతీయ రహదారి నుంచి ఆర్టీసీ రీట్రేడింగ్ మీదుగా నెల్లూరు నగరానికి విస్తరిస్తున్న రోడ్డు వల్ల పడుగుపాడులో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఏకంగా పడుగుపాడు రెండుగా విడిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రోడ్డు మధ్య భాగంలో బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పది అడుగుల దూరంలోని ప్రాంతానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తున్నది. రోడ్డు విస్తరణ వల్ల నెల్లూరుకి వెళ్లేందుకు రాకపోకలకు మార్గం అనుకూలంగా ఉన్నప్పటికీ బారికేడ్లు ఏర్పాటుచేయడంతో పడుగుపాడు గ్రామమే రెండుగా విడిపోతున్నట్లు అన్పిస్తోంది. పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే బారికేడ్ల ఏర్పాటు వల్ల రెండు కిమీ దూరం తిరిగి వెళ్లాల్సివస్తోంది. అధికారులు బారికేడ్లను తొలగించాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.



ఆందోళన చేస్తున్న పడుగుపాడు వాసులు

● స్థానికుల నిరసన

రోడ్డు విస్తరణల పనుల్లో భాగంగా పడుగుపాడులో బారికేడ్లు ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం స్థానికులు ఆందోళనకు దిగారు. నెల్లూరు- కావలి మార్గంలో రాస్తారోకో చేశారు.దీంతో వాహనాలు రెండు కి.మీ దూరం నిలచిపోయాయి. బారికేడ్ల తొలగించాలని నినాదాలు చేశారు. ఆందోళనకు టీడీపీ, వైసీపీ, సీపీఎం నాయకులు మద్దతు ప్రకటించారు.



మా ఇంటికి దారేది ?

పడుగుపాడులోని కాటంరెడ్డి రామచంద్రారెడ్డి నగర్‌లోని మా ఇంటికి సుందరయ్య కల్యాణ మండపం నుంచి వెళ్లాలంటే రెండు కి.మీ దూరం ప్రయాణించాలి. అదే బారికేడ్లు లేకపోతే పది అడుగుల దూరంలోని మా ఇంటికి చేరుకోవచ్చు.రోడ్డు విస్తరణ అందరికీ అనుకూలంగా ఉంది. బారికేడ్లు ఏర్పాటు చేసినందు వల్ల ఇబ్బందులు పడుతున్నాం.

\- మన్నేపల్లి నరసయ్య, కాటంరెడ్డి రామచంద్రారెడ్డి నగర్, పడుగుపాడు

పంచాయతీ కార్యాలయానికి దారేది ?

మా పంచాయతీ కార్యాలయానికి వెళ్లాలంటే ప్రధాన రహదారి దాటి రెండు కి.మీ దూరం వెళ్లాల్సి వస్తోంది. అదే బారికేడ్లు లేకుంటే రెండు కి.మీ చుట్టు తిరిగే కష్టం తప్పిపోతుంది. అధికారులు స్పందించి మాకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరుతున్నాం.

\- మోడెం ప్రద్యుమ్నకుమార్‌రెడ్డి, పడుగుపాడు



ఈ నీళ్లు ఎలా తాగాలి?

● పంచాయతీ కొళాయిలో కలుషిత నీటి సరఫరా

● దుర్వాసనపై గిరిజనుల ఆందోళన

మనుబోలు, మే 21: స్థానిక పంచాయతీ కొళాయిల ద్వారా వచ్చే నీరు దుర్వాసన వస్తోందని, ఇలాంటి నీటిని ఎలా తాగాలంటూ స్థానిక సీఎం నగర్ గిరిజన కాలనీవాసులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు విషపూరిత రసాయన ద్రవం కలిపినట్లుగా అనుమానం కలుగుతోందన్నారు. నిన్నటివరకు బాగానే ఉన్న తాగునీరు మధ్యాహ్నం వచ్చిన నీరు దుర్వాసన వచ్చిందన్నారు. ముందుగా గుర్తించాం కాబట్టి సరిపోయిందన్నారు. లేకుంటే ఆ నీరు తాగిఉంటే తమ ప్రాణాలకు ముప్పువాటిల్లేదని మండిపడ్డారు. పంచాయతీ సిబ్బంది ట్యాంకును సక్రమంగా శుభ్రం చేయడం లేదన్నారు. చేసేదిలేక పట్టుకున్న నీటిని పారబోశామన్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటరమణను వివరణ కోరగా ట్యాంకులో ఉన్న నీటిని తొలగించి, శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం శుభ్రమైన నీటిని పంపి, అందరికి సరఫరా చేస్తామన్నారు.



సీఎం నగర్ గిరిజన కాలనీలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

జగదేవిపేటలో రైతు సదస్సు



విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఏడీఏ రాజకుమార్

ఇందుకూరుపేట, మే 21 : ఏజీబీఎస్సీ చదువుతున్న ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆర్ఏడబ్ల్యూఈపీ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండలంలోని జగదేవిపేట కమ్యూనిటీ హాల్‌లో రైతు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మ డీపీడీ శివనారాయణ, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివజ్యోతి, ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, కేవీకే సభ్యులు లోకేష్, కిరణ్‌లు పాల్గొన్నారు. గడిచిన మూడు నెలలుగా విద్యార్థులు గ్రామంలోని రైతులను కలిసి వివిధ పంటల గురించి తెలుసుకుని, వాటికి సంబంధించిన నమూనాలను, చిత్రపటాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా డేవిస్‌పేట, జగదేవిపేట గ్రామాల్లో భూసార పరిరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగదేవిపేటలో కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శివజ్యోతి మాట్లాడుతూ మట్టి నమూనా పరీక్ష నివేదిక ఆధారంగానే ఎరువులు వాడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వాగ్దేవి, వీపీఏలు మాధవయ్య, నవీన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

మనుబోలు, మే 21: ప్రమాదానికి గురైన గూడూరు నరసింగరావుపేటకు చెందిన దండగల నారాయణ కుమార్తె భార్గవికి మనుబోలు జనసైనికుడు చెలికం కోటీశ్వర్‌రెడ్డి తన తోటి పూర్వ విద్యార్థులతో కలిసి ఆర్థికసాయం చేశాడు. మంగళవారం రూ.11,863లను గూడూరులోని భార్గవి కుటుంబసభ్యులకు నగదును అందజేశారు. కార్యక్రమంలో కోటితో పాటు ఖాదర్‌వలి, వెంకటేశ్వర్లు, చిట్టమూరు వెంకటకృష్ణారెడ్డి ఉన్నారు.

వెలవెలబోయిన ఆరోగ్య సురక్ష

మనుబోలు, మే 21: స్థానిక సచివాలయం-2లో మంగళవారం నిర్వహించిన ఆరోగ్యసురక్ష కార్యక్రమం రోగులు లేక వెలవెలబోయింది. సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రజలకు కార్యదర్శులు తెలపకపోవడంతో కార్యక్రమానికి పదుల సంఖ్యలో మాత్రమే వచ్చారు. దీంతో పాటు గతంలో జరిగిన సురక్ష కార్యక్రమాలలో అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార ప్రదర్శనలు నిర్వహించేవారు. ఈమారు సిబ్బంది కూడా హాజరుకాలేదు.. నలుగురు వైద్యులు వచ్చారు. వైద్య, సచివాలయ సిబ్బంది మాత్రమే సురక్ష కార్యక్రమంలో తారసపడ్డారు. వెలవెలబోయిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై రాజకీయనాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు దండోరా రూపంలో, పత్రికా ముఖంగాని తెలపకుండా అధికారులు నామమాత్రంగా నిర్వహించడమేమిటని ప్రశ్నించారు.



మనుబోలు-2 సచివాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

మోహినీ అవతారంలో లక్ష్మీనృసింహుడు

రంగడి ఆలయం నుంచి గొడుగుల సమర్పణ

నెల్లూరు రూరల్, మే 21 : వేదగిరిలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో మంగళవారం మోహినీ అవతారంలో లక్ష్మీనరసింహుడు భక్తులను ఆకట్టుకున్నారు. ముందుగా ఉత్సవర్లకు అర్చక బృందం విశేష పూజలు నిర్వహించింది. అనంతరం మోహినీ అవతారంలో స్వామివారు పల్లకీలో ఆశీనులై ఆలయ పురవీధుల్లో ఊరేగారు. అనంతరం మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ స్వామివారు ములుముడి గ్రామానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం ఆలయంలో అఖండ జ్యోతి వెలిగించిన అర్చకులు మూలవర్లకు పూలంగి సేవ నిర్వహించారు. అర్ధరాత్రి దాటాక స్వామివారు తనకు ఇష్టమైన బంగారు గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. ఈ సమయంలో భారీగా బాణసంచా కాల్చిన ఆలయ సిబ్బంది స్వామివారి వైభవం చాటే విధంగా ఆలయానికి విద్యుద్దీకరణ చేశారు. కాగా, నెల్లూరులోని రంగనాథ స్వామి ఆలయం నుంచి నూతన గొడుగులు వేదగిరీశుడికి సమర్పించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఈవో గిరికృష్ణ, ప్రధాన అర్చకులు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.



మోహినీ అవతారంలో ఊరేగుతున్న శ్రీవారు



పెంచలకోన బ్రహ్మోత్సవాలలో మంగళవారం జరిగిన బాలికల నృత్యప్రదర్శన

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



ఫుట్‌బాల్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

వేసవి క్రీడా శిబిరాలకు మంగళం!

● అనుమతులు ఇవ్వని శాప్

● డీఎస్‌ఏలో మొక్కుబడిగా నిర్వహణ

● అదికూడా క్రీడాకారుల నుంచే ఫీజు వసూలు

● రాష్ట్ర ప్రభుత్వ తీరుపై అసహనం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. గడిచిన ఐదేళ్లలో రెండుసార్లు మాత్రమే ఎలాంటి నిధులు ఇవ్వకుండా, క్రీడా పరికరాలు అందించకుండా, శిక్షకులకు వేతనాలు ఇవ్వకుండా మొక్కుబడిగా వేసవి శిబిరాలను నిర్వహించింది. ఈ ఏడాది కనీసం ఈ శిక్షణ కూడా లేకుండా చేయడంతో క్రీడాకారుల్లో నిరుత్సాహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల కోడ్ రాక ముందు మాత్రం ఆడుదాం ఆంధ్రా అంటూ హడావుడి చేసి ఆర్భాటపు ప్రచారం చేసుకుంది. కోట్లాది రూపాయల బడ్జెట్‌ను విడుదల చేసి ఊరూరా జగన్ ఫొటోలతో ప్రచారం నిర్వహించింది. అయితే, వేసవి శిబిరాలకు మాత్రం మొండిచేయి చూపించి క్రీడాకారులకు అన్యాయం చేసింది.

నెల్లూరు (విద్య), మే 21 : ఏడాది పాటు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులకు ఆటవిడుపు కోసం ప్రతి ఏడాది క్రమం తప్పకుండా నిర్వహించే వేసవి క్రీడాశిక్షణ శిబిరాలకు ఈ ఏడాది మొండి చేయి చూపించారు. మే 1 నుంచి నెలరోజుల పాటు జరిగే ఈ శిబిరాలను ఈ ఏడాది ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో తొలుత 15 రోజులు ఆలస్యంగా ప్రారంభించి నిర్వహిస్తామని అధికారులు ప్రకటించారు. అయితే గడువు ముగిసిన తరువాత శాప్ ఉన్నతాధికారులు ఈ ఏడాది వేసవి శిబిరాల నిర్వహణకు అనుమతి లేదని, నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మాత్రం ఉన్న కోచ్‌లతో శిక్షణ నిర్వహించుకోవాలని సూచించినట్లు అధికారులు తెలిపారు. అది కూడా తాము ఎలాంటి నిధులు విడుదల చేయడం లేద ని, క్రీడాకారుల నుంచి ఫీజులు వసూలు చేసుకుని నిర్వహించుకోవాలని సూచించడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● క్రీడాకారుల్లో నిరుత్సాహం

క్రీడల్లో సాధన చేసి రాణించాలనుకున్న క్రీడాకారులు శిబిరాలు నిర్వహణ లేకపోవడంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ప్రభుత్వం శిబిరాల్లో పాల్గొనే శిక్షకులకు గౌరవ వేతనం అందచేయడంతోపాటు క్రీడా సామాగ్రి కి, మైదానం నిర్వహణకు, పౌష్టికాహారానికి నిధులు కేటాయించేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలి ఏడాది మాత్రం నిర్వహణ జరగగా కరోనా నేపథ్యంలో మూడేళ్లపాటు నిర్వహణ లేదు. గత ఏడాది మాత్రం అతి తక్కువ శిబిరాలతో మొక్కుబడిగా నిర్వహించి ఈ ఏడాది పూర్తిగా తొలగించారు. వేసవిలో క్రీడల్లో తర్ఫీదుపొంది నైపుణ్యాలను పెంచుకోవాలనుకున్న చిన్నారులకు నిరాశ ఎదురైందంటున్నారు.



షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ...

శాప్ కోచ్‌లతో నిర్వహణ

వేసవి క్రీడా శిబిరాలకు శాప్ నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. జిల్లాలో ఈ ఏడాది 50 శిబిరాలకు పైగా నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి శాప్‌కు పంపినట్లు తెలిపారు. అనుమతులు రాకపోవడంతో స్టేడియంలో మాత్రం రెగ్యులర్ కోచ్‌లతో శిక్షణ ఇస్తున్నాం. ఫుట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, షటిల్, వెయిట్‌లిఫ్టింగ్, బాక్సింగ్, సాఫ్ట్‌బాల్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నాము.

\- ఆర్‌కే.యతిరాజ్, డీఎస్‌డీవో

ఆకట్టుకున్న మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్



మాక్ డ్రిల్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్పీ

నెల్లూరు(క్రైం), మే 21: అవాంఛనీయ సంఘనలు, హింసాత్మక చర్యలకు పాల్పడినప్పుడు, అల్లర్లు చేస్తున్న సమయంలో ఎలా స్పందించాలి, జన సమూహాలను ఎలా అదుపు చేస్తారో ప్రజలకు తెలియజేసేలా నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో మంగళవారం స్పెషల్ పార్టీ పోలీసులు మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏఆర్ సిబ్బంది నిర్వహించిన మాక్ డ్రిల్‌ను ప్రజలు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ కే ఆరీఫ్ హాఫీజ్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసు సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరి రక్షించడమే ధ్యేయంగా ముందుకు అడుగులు వేయాలన్నారు. జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తూ విధ్వంసానికి ప్రయత్నించే అల్లరి మూకలను అణచి వేసేందుకు, అత్యవసర సమ యంలో పరిస్థితులను అదుపులోకి తీసుకొని వచ్చేలా ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. మాక్ డ్రిల్‌లో ఏఎస్పీలు, డిఎస్పీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం..

నెల్లూరు(వైద్యం), మే 21 : శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండల సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధి నిర్వాహణలో ఉన్న వైద్య సిబ్బందిపై దాడులు చేయడం దారుణమని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్(హంస) జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య సిబ్బందిపై దాడులు చేసి కొట్టడమే కాకుండా ఫర్నిచర్, రికార్డులు ధ్వంసం చేయడం అన్యాయమన్నారు. ఇలాంటి అరాచక శక్తులకు గుణపాఠం చెప్పాలని, దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, నేతలు మజారుల్లా, పరిమళ, జలీల్ అహ్మద్, ఆసియా బేగం, వేణు, సుమతి, ఉమాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానవ జన్మకు గమ్యం మోక్షమే..

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : మానవ జన్మకు గమ్యం మో క్షమేనని, దాని కోసం జీవాత్మ పరమాత్మ ఏకత్వంను గ్రహించి అద్వై త మార్గంలో జ్ఞానం సంపాదిం చాలని ఓరుగంటి శ్రీరామలీలశర్మ కోరారు. పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో జరిగిన సంస్క రణ వారోత్సవాలలో మంగళవారం ఆయన ప్రవచనం చేశారు. ఏది సత్యం, ఏది అసత్యం అని ప్రశ్నించుకుని ఆనందమయమైన బ్రహ్మమే శాశ్వతం అని గ్రహించాలని కోరారు. వీటన్నింటికి వేదాలు ప్రామాణికం అని ఆదిశంకరాచార్యులు తెలిపారని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చన, ఆదిశంకరాచార్యులకు పుష్పార్చన కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో అన్నవరం సత్యనారాయణ దంపతులు శ్రీరామలీలశర్మను సత్కరించారు. శనగవరపు సత్యనారాయణమూర్తి, తంగిరాల వెంకట శ్రీకాంత్ శర్మ, చక్రాల ఆనందకుమార్, పి.వెంకటేశ్వరప్రసాద్, చక్రాల వెంకటలక్ష్మీనరసింహం పాల్గొన్నారు.



మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం

రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయం చూపండి : ఏడీఏ

నెల్లూరురూరల్, మే 21 : భూమి క్షీణించుకుపోవడానికి ప్రధాన కారణమైన రసాయనిక ఎరువుల వాడకానికి బదులుగా ప్రత్యామ్నాయాలు వినియోగించాలని నెల్లూరు వ్యవసాయ శాఖ ఏడీ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని మాదరాజుగూడూరు, పెనుబర్తి గ్రామాలలో రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనికి ఎరువులు వాడకాన్ని ఘననీయంగా తగ్గించాలని సూచించారు. ఇందు కోసం పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయాలని చెప్పారు. ఆర్బీకేల్లో రాయితీపై అందిమస్తామని తెలిపారు. జీలుగ, జనుము, కేజీ రూ.44లకు, పిల్లిపెసర రూ.67లకు అందిస్తున్నామని వెల్లడించారు. రైతులందరు వీటిని తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎడగారులో పంట పొలాలన్నీ ఖాళీగా ఉన్నందున వీటి సాగు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది షకీల్ అహ్మద్ మృతి

నెల్లూరు(లీగల్), మే 21 : సీనియర్ న్యాయవాది సయ్యద్ షకీల్ అహ్మద్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. 30 ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్న ఆయన అకాల మరణం పట్ల రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీ.ఉమామహేశ్వర్‌రెడ్డి, వీ.సుందరయ్య యాదవ్, తదితర న్యాయవాదులు తమ సంతాపం ప్రకటించి వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పార్థీవదేహాన్ని పలువురు న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు.

ముగిసిన శత ఛండీయాగం

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నగరంలోని వేదాయపాలెం త్యాగరాజస్వామి మందిరంలో 3 రోజుల పాటు జరిగిన శత ఛండీ యాగం మంగళవారం ముగిసింది. ఆలయంలో కేదార్‌నాథ్ నుంచి తెచ్చిన సాలిగ్రామం, శివలింగం, కమలాంబిక అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠ వార్షికోత్సవం, కుంబాభిషేకం సందర్భంగా మాచవోలు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో 21 మంది రుత్వికులు ఈ యాగం చేశారు. మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఆలయంలో మూలవిరాట్, ఆలయాల కలిశాలకు మహాసంప్రోక్షణ జరిగింది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి.



మహాసంప్రోక్షణలో రుత్వికులు

జీజీహెచ్‌లో ఉద్యోగుల రక్తదానం

నెల్లూరు(వైద్యం), మే 21 : సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మంగళవారం ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంధాని బాషా, సీఐటీయూ నేతలు కిన్నెర కుమార్, కమ్మటి శ్రీనివాసులు, డాక్టర్ రాజీవ్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు సహస్ర ఘటాభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), మే 21: నగరంలోని పప్పులవీధిలో ఉన్న ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 8గంటల నుంచి 1008 ఘటాలతో స్వామివారికి అభిషేకం జరుగుతుందని దేవస్థానం కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగు తుందని పేర్కొన్నారు. అన్నమయ్య జయంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటలకు గుండాల గురవయ్య ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల గానకచ్చేరి జరుగుతుందని భక్తులు అందరూ పాల్గొనాలని పేర్కొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : కొండాయపాలెంలోని అబైండింగ్ హోప్ ట్రస్ట్‌లో మంగళవారం జరిగిన పోషకాహారం పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అబైండింగ్ హోప్ ట్రస్ట్ చైర్మన్ నిర్మలకుమార్‌తో కలసి 200 మందికి పోషకాహార కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ రోసాలియో, ఏ.జయప్రకాష్, ఫాదర్ లివింగ్స్టన్, రూట్‌బినోమి, మరియమ్మ, శశి, వేదకృప, విలియమ్స్ క్రాంతి, హేమంత్ పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథుకి రావణసేవ

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటలో అన్నపూర్ణ విశాలక్షి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో మంగళవారం రాత్రి రావణసేవ అలంకారం, ఉత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ జరిగాయి. రాత్రి హోమాలు, విశేష పూజలు, రావణసేవలో నగరోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి ఉభయకర్తలుగా శ్రీరాజరాజేశ్వరి రైస్ ఇండస్ట్రీ అధినేతలు కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మీలు వ్యవహరించారు. కార్యక్రమాలను ఈవో జి.దర్గయ్య పర్యవేక్షించారు.

చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నగరంలోని మినీ బైపాస్‌రోడ్డు అన్నమయ్య సర్కిల్ వద్ద మంగళవారం నెల్లూరు రాష్ట్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. అల్లూరు జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ప్రసన్నలక్ష్మి తన తండ్రి బొగ్గవరపు లక్ష్మీనారాయణ (కమర్షియల్ ట్యాక్స్) జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ, చల్లని మంచినీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో విరసం నెల్లూరు శాఖ అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

రేపు మామిడి పండ్ల రసాభిషేకం

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నగరంలోని పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం 7 నుంచి 9.30గంటల వరకు మామిడి పండ్ల రసంతో అభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు మామిడి పండ్ల రసం తీసుకువచ్చి తమ గోత్రనామాలతో అభిషేకం చేసుకోవాలని పేర్కొన్నారు.

పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ

నెల్లూరు(సాంస్కృతికం), మే 21 : నగరంలోని జస్టిస్ అన్సారీ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. ప్రజా సైన్సు వేదిక పట్టణ అధ్యక్షుడు ఎం.సతీష్ కుమార్ కాగితాలతో వివిధ రకాల టోపీలు తయారీలో మెలకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ చంద్రగిరి ఈశ్వరమ్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ.

ఊరంతా జాతర

- వజ్రకిరీటంలో వెలిగిపోయిన గంగమ్మ
- అన్నదానాలు, అంబళ్ల ప్రసాదాల వితరణ
- నేడు విశ్వరూప దర్శనం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర చేసుకుంది. అమ్మలగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. అంబళ్లు పోసి తాపం తీర్చింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని భక్తి పారవశ్యంతో చిందేసింది. వారం పాటు రోజుకో అలంకరణతో దర్శనమిచ్చిన తాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం ఉదయాత్పూర్వం మహాభిషేకం చేసి శాంతింపజేశారు. స్వల్ప తోపులాట మినహా మహాభిషేక కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. సర్వాలంకారశోభితురాలైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు.అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లుదండాలు, అడుగడుగు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.టీపీ ఏరియాలోని తాళ్లపాక పెదగంగమ్మ, చింతల చేనులోని ముత్యాలమ్మ,దాసరిమఠంలోని మాతమ్మ, పల్లెవీధిలోని వేశాలమ్మ, చింతకాయవీధిలోని కరిమాను గంగమ్మలతో పాటు నగరంలో వున్న చిన్న గంగమ్మ ఆలయాల్లో కూడా జాతర సంబరాలు అంబరాన్నంటాయి.మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. గత ఏడాదికన్నా ఈసారి సప్పరాలు ధరించిన భక్తులు పెద్దఎత్తున కనిపించారు. నగరంలో ఎక్కడ చూసినా అంబళ్ల పంపిణీ, అన్నదాన వితరణ కార్యక్రమాలు విరివిగా జరిగాయి.మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూప స్థూపానికి అమ్మవారి విశ్వరూపం తయారు చేయడం మొదలుపెట్టారు. బుధవారం తెల్లవారుజామున చెంపనరుకుడుతో గంగజాతర పరిసమాప్తి కానుంది.





సప్పరంతో భక్తుడు - నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

వాగ్దేవి రూపంలో నృసింహుడు

రామావతారంలో హనుమంతుడిపై పెంచలస్వామి విహారం



సరస్వతీ దేవి అలంకరణలో స్వామి వారు

డక్కిలి, మే 21 : పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం సరస్వతీదేవి అలంకరణలో స్వామివారు హంసవాహనంపై భక్తులను కటాక్షించారు.అనంతరం స్వామివారికి ఊంజల్ సేవ, తిరుమంజనం నిర్వహించాక సేద తీర్చేందుకు 12 గంటలకు స్నపన తిరుమంజనం జరిపించారు.అనంతరం యాగశాలలో లక్ష్మీనారసింహ హోమం నిర్వహించారు.రాత్రి శ్రీరామచంద్రుడి అలంకారంలో ముస్తాబైన నృసింహ స్వామి బంగారు హనుమ వాహనంపై మాడ వీధుల్లో విహరించారు.బుధవారం గరుడవాహన సేవ జరగనుంది. నృసింహ స్వామి జయంతి కూడా కావడంతో ఈ వేడుకలను తిలకించడానికి పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులకోసం వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 120కి పైగా ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపనున్నారు.



హనుమ వాహన సేవకు హాజరైన భక్తజనం

కౌంటింగు నాడు అల్లర్ల ముప్పు?

ఇంటెలిజన్స్ హెచ్చరికలతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), మే 21: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు రోజు, మరుసటి దినం జిల్లాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అదే తరహాలో జూన్ 4వతేది ఓట్ల లెక్కింపు రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం వుందని ఇంటెలిజన్స్ వర్గాలు హెచ్చరించాయి.ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, నడవలూరు, రామాపురం, బ్రాహ్మణకాల్వ, నెన్నూరు గ్రామాలతో పాటు తిరుపతిలోని ఎస్టీవీ నగర్, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ నగర్, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో అల్లర్ల ముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లర్లకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, పాత నేరస్తులను బైండోవర్ చేయించే పనిలోపడింది.కౌంటింగ్ పూర్తయిన వారం రోజుల పాటు ఈ పికెట్లు కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. అల్లర్లు జరిగే ప్రాంతాలకు త్వరితగతిన చేరుకునేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ టీములను సిద్ధం చేశారు. మరో వైపు ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చి

- సూళ్లూరుపేటలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం



ఎ.రంగంపేటలోని ఓ ఇంట్లో సోదాలు

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం పలుచోట్ల పోలీసులు కార్డన్ సెర్చి పేరిట తనిఖీలు చేపట్టారు.గత 13వ తేదీన పోలింగ్ రోజు, మరుసటి రోజు పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే.వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఆ సందర్భంగా కూడా హింస చెలరేగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తచర్యగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో గూడూరు పట్టణం గాంధీనగర్, ఇందిరానగర్, చవటపాలెం, టిడ్కో ఇళ్ళ సముదాయం తదితర ప్రాంతాలను పోలీసు బలగాలు చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టాయి.ఉదయం 8గంటల నుంచీ 10గంటల వరకూ దాదాపు ఇల్లిల్లూ గాలించారు. సరైన పత్రాలు లేని మూడు ఆటోలు, 30 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూళ్ళూరుపేట పట్టణం సూళ్లూరు ప్రాంతాన్ని పోలీసులు కార్డన్ సెర్చిలో భాగంగా జల్లెడ పట్టారు. ఉదయం 6 గంటల నుంచీ 9 గంటల వరకూ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ ఇంట్లో రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఓ మహిళ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇక నాయుడుపేట పట్టణం ఎన్‌ఎస్ఆర్ కాలనీలో వేకువజామున 5.30 గంటల నుంచీ ఉదయం 7.30 గంటల వరకూ కార్డన్ సెర్చిలో భాగంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో దౌర్జన్యకర వాతావరణం నెలకొని వుంటుందని, గంజాయి అమ్మకాలు కూడా జరుగుతుంటాయని సమాచారం. అయితే పోలీసు తనిఖీల గురించి ముందే సమాచారం లీక్ కావడంతో అసాంఘిక శక్తులు అప్రమత్తమయ్యాయని, అందుకే అనుమానితులు ఎవరూ పట్టుబడలేదని తెలిసింది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట గ్రామంలో పోలీసు బలగాలు తెల్లవారుజామున 5 గంటల నుంచీ 7 గంటల వరకూ ఇల్లిల్లూ తనిఖీ చేశాయి. అయితే అనుమానితులు గానీ, ఇతరత్రా నిషేధిత వస్తువులు గానీ, పత్రాలు లేని వాహనాలు గానీ పట్టుబడలేదు.

ఎన్నికల కాలంలో తెగ తాగేశారు

రెండు నెలల్లో రూ.273 కోట్ల మద్యం వాడకం

తిరుపతి (నేరవిభాగం), మే 21 : సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను పార్టీలు మద్యం మత్తులో ముంచెత్తాయి. ముందుగానే తమిళనాడు మద్యాన్ని అక్రమంగా దిగుమతి చేసుకుని దాదాపు రెండు నెలల పాటు తిరుపతి, చంద్రగిరి, నాయుడుపేట,సూళ్ళూరుపేట ప్రాంతాల్లో ఓటర్లతో పాటు ప్రచారం చేసిన కార్యకర్తలకు విచ్చలవిడిగా పంపిణీ చేశారు.మన జిల్లాలోని మద్యం షాపుల్లో అమ్మకాలతో తమిళనాడు నుంచి తరలించిన మద్యాన్ని కలుపుకుంటే దాదాపు రూ273 కోట్ల విలువైన మద్యం ఈ రెండు నెలల్లో తాగించినట్లు అంచనా. మరో 83,339 కేసుల బీర్ల అమ్మకాలు కూడా జరిగాయి. తద్వారా ప్రభుత్వానికి రూ 21.11 కోట్ల ఆదాయం లభించింది.

కౌంటింగ్‌కు పరిశీలకుల నియామకం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వచ్చే నెల 4వ తేదీన చేపట్టనున్న ఓట్ల లెక్కింపు పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది. మధ్యప్రదేశ్, మహరాష్ట్ర, కర్ణాటక కేడర్‌లకు చెందిన సీనియర్ అధికారులు జిల్లాలో పరిశీలకులుగా నియమితులయ్యారు. చంద్రగిరి అసెంబ్లీ సెగ్మెంట్‌కే ప్రత్యేకించి ఒకరిని నియమించగా వెంకటగిరి, శ్రీకాళహస్తిలకు ఒకరు, సూళ్లూరుపేట, తిరుపతిలకు ఒకరు, గూడూరు, సత్యవేడులకు ఒకరు చొప్పున పరిశీలకులను ఈసీ నియమించింది.

నియోజకవర్గాల వారీగా పరిశీలకుల వివరాలు

నియోజకవర్గం	పరిశీలకుల పేరు	మొబైల్ నంబరు
చంద్రగిరి	కైలాష్ వాంఖెడే	9425101644
వెంకటగిరి, శ్రీకాళహస్తి	డాక్టర్ జ్యోత్స్న విద్యాసాగర్	9923021792
సూళ్లూరుపేట, తిరుపతి	ఉజ్వల్ కుమార్ ఘోష్	7338525461
గూడూరు, సత్యవేడు	కె.జ్యోతి	9900118421

నగరిదే తొలి ఫలితం

- ఈ నియోజకవర్గ బరిలో ఏడుగురు అభ్యర్థులే
- ఆ తర్వాత చిత్తూరు, పుంగనూరు ఫలితాలు
- ఆలస్యంగా 12గంటల ప్రాంతంలో పలమనేరు ఫలితం

చిత్తూరు కలెక్టరేట్, మే 21: ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడుతుండడంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. అటు అభ్యర్థులు, ఇటు ప్రజల్లోనూ ఒక్కటే పరిస్థితి. తాము గెలవాలని అభ్యర్థులు, ఓటేసిన అభ్యర్థి గెలవాలని ఓటర్లు నిత్యం జూన్ 4వ తేదీకోసం రోజులు లెక్కిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో ఎన్నికలు జరిగిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలి ఫలితం వెలువడేది నగరిదే. ఇందుకు ప్రధాన కారణం.. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే నగరిలోనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ ఓటర్ల సంఖ్య 2,02,574. అందుకు తగ్గట్లే తక్కువగా 231 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో పోల్చితే ఒక రౌండ్ ముందుగానే ఓట్ల లెక్కింపు పూర్తయ్యి ఫలితం వెలువడనుంది. పైగా ఇక్కడ అభ్యర్థులు కేవలం ఏడుగురే కావడంతో ఈవీఎంలో ఓట్ల లెక్కింపులకు కూడా తక్కువ సమయం తీసుకుంటుంది. అందుకని పది గంటల ప్రాంతంలోనే ఫలితం రావొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ హాలులో 14 టేబుళ్ళను ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏ పార్టీ అభ్యర్థి తొలుత జెండా ఎగురవేస్తారన్నది తేలిపోతుంది. ఇక, ఎనిమిది మంది అభ్యర్థులతో 265 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,38,868 మంది ఓటర్లున్న పుంగనూరు.. 13మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ అతి తక్కువగా 226 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,02,850 మంది ఓటర్లు ఉన్న కారణంగా చిత్తూరు ఫలితాలు కూడా ఆ తర్వాత 15 నిమిషాల వ్యవధిలో వెలువడనున్నాయి. ఇక, అత్యధిక (14 మంది) అభ్యర్థులు, 288 పోలింగ్ కేంద్రాలు, 2,67,896 మంది ఓటర్లు కలిగిన పలమనేరు నియోజకవర్గం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఫలితం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వెలువడొచ్చని అధికారులు అంటున్నారు. 11మంది అభ్యర్థులు, 256 పోలింగ్ కేంద్రాలు, 2,04,949 ఓటర్లు కలిగిన గంగాధరనెల్లూరు ఫలితాలు, 12 మంది అభ్యర్థులు, 262 పోలింగ్ కేంద్రాలు, 2,20,999 ఓటర్లు కల్గిన పూతలపట్టు ఫలితాలు, 13 మంది అభ్యర్థులు, 243 పోలింగ్ కేంద్రాలు, 2,25,775 ఓటర్లు కల్గిన కుప్పం ఫలితాలు సుమారు 11 గంటల మధ్య వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



కారులోపల వేలాడుతున్న బాల ఏసు ఫొటో

టీటీడీలో మరోసారి భద్రతావైఫల్యం

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): క్రైస్తవమత గుర్తులతో ఉన్న ఓ కారు తిరుమలకు రావడం విమర్శలకు దారి తీసింది. సాధారణంగా హిందూయేతర మతాలకు చెందిన గుర్తులు, కరపత్రాలు, స్టిక్కర్లతో వాహనాలు తిరుమలకు రావడం నిషేధం. వీటిని అలిపిరి టోల్‌గేట్‌లో జరిపే భద్రతా తనిఖీల్లోనే గుర్తించి తొలగించాలి. కానీ, భద్రతా సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మంగళవారం టీఎస్ 19 ఏఎక్స్ 2772 నెంబరు గల కారు క్రైస్తవ మతానికి చెందిన ఫొటోతో తిరుమలకు వచ్చింది. మ్యూజియం వద్ద పార్కు చేసివున్న కారును గుర్తించిన స్థానికులు తిరుమల విజిలెన్స్ అధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే విజిలెన్స్ అధికారులు, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని కారులో ఆ గుర్తులను తొలగించారు.

వాళ్లు కోళ్లు పంచితే మీకేమి అభ్యంతరం!

విచారణ అధికారుల తీరుపై గ్రామస్తుల విస్మయం

సూళ్లూరుపేట, మే 21: ఎన్నికలకు రెండు రోజుల ముందు గ్రామంలో ఓటర్లకు నగదు పంచారంట కదా అధికార పార్టీ నాయకులు కోళ్లు పంచితే తప్పేమేటి అంటూ విచారణకు వెళ్లిన అధికారులు గ్రామస్తులను సంబంధం లేని ప్రశ్నలడిగినట్లు తెలిసింది. మండల పరిధిలోని మంగానెల్లూరులో పోలింగ్ ముందు రోజు అధికార పార్టీ నాయకులు కోళ్ల పంపిణీపై సర్పంచ్ కె.శేఖర్ ఫిర్యాదుతో ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఎంపీడీవో చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి వి.రాజారెడ్డితో పాటు ఎస్ఐ రహీం రెడ్డి, ఏఎస్ఐలు రమణయ్య, రామ్మూర్తి గ్రామంలో విచారణ చేపట్టారు. పోలీసులు అవసరం లేకున్నా అధికారులు వారిని వెంటబెట్టుకొని వెళ్లారు. విచారణ సమయంలో పోలీసులు కొందరితో టీడీపీ వాళ్లు నగదు పంపిణీ చేశారంటా కదా అంటూ గ్రామస్తులను పదేపదే అడగడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై టీడీపీ నాయకులు జి.నారాయణ రెడ్డి, మాట్లాడుతూ... తాము ఓటర్లను ప్రలోభాలకు గురి చేసినట్లు ఆధారాలుంటే కేసులు పెట్టి చర్యలు తీసుకోండంటూ పోలీసులకు తెలిపారు. కోళ్ల పంపిణీ చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ డిమాండ్ చేశారు. తూతూమంత్రంగా విచారణ చేసిన పంచాయతీ కార్యదర్శి పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక బస్సులు



గూడూరు అర్బన్, మే 21: రాపూరు మండలం పెంచల కోనలో జరుగుతున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్స వాలకు గూడూరు నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి భక్తులు పెంచలకోనకు వెళ్తుంటారు. డిపో నుంచి బుధ, గురువారాల్లో 8 సర్వీసులను నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికా రులు తెలిపారు. గరుడోత్సవం, కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్తుంటారు. ఈక్రమంలో ఈనెల 22న జరిగే గరుడోత్సవానికి బస్సులు నడుపుతున్నారు. గూడూరు నుంచి పెంచలకోనకు రూ.115, సైదాపురం నుంచి రూ.90గా నిర్ణయించారు.

అవార్డుతో బాధ్యత పెరిగింది



అవార్డులతో మయూరి శ్యామ్‌యాదవ్

గూడూరు, మే 21: ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సులో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకోవడంతో మ రింత బాధ్యత పెరిగిందని మయూరి శ్యామ్‌యాదవ్ తెలిపారు. శ్రీకృష్ణ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, డీఆర్ యూసీసీ సభ్యుడిగా, రోటరీక్లబ్ సభ్యుడిగా తాను కోవిడ్ సమయంలో చేసిన పలు సామాజిక, సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు ఈ అవార్డు అందించారన్నారు. అవార్డును అందజేసినందుకు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇండియా చీఫ్ కోఆర్డినేటర్ నరేంద్రగౌడ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

జోరందుకున్న బెట్టింగులు

చిట్టమూరు, మే 21: ఎన్నికల ఫలితాల అంచనాలపై పలు చోట్ల బెట్టింగులు జోరుగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన చిట్టమూరులో రూ.లక్షల్లో బెట్టింగ్‌ల పర్వం చాపకింద నీరులా సాగుతోంది. రూ.పది వేల నుంచి లక్ష వరకు బెట్టింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. ఓ వైపు ట్వంటీ20 క్రికెట్ మ్యాచ్‌ల బెట్టింగ్, మరో వైపు ఎన్నికల ఫలితాలపైన బెట్టింగ్ జోరు ఎక్కువైంది. దీంతో మండలంలో ఇటీవల ఒక వర్గం తమ పార్టీనే గెలుస్తుందని బెట్టింగ్‌లకు రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడడంతో ఇరు పార్టీల మధ్య వివాదం చెలరేగింది. ఇలా ఎవరికి తగ్గట్టు వారు బెట్టింగ్‌లు పెట్టుకొని మధ్యవర్తుల వద్ద నగదును ఉంచుతున్నట్లు తెలిసింది. కొందరు మద్యంబాబులు కూడా క్వార్టర్ బాటిల్ నుంచి ఫుల్ బాటిల్ వరకు బెట్టింగ్ పెట్టుకోవడం గమనార్హం.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ సప్లిమెంటరీ ప్రశ్నపత్రాలు



కోట, మే 21: కోట పోలీస్ స్టేషన్‌కు మంగళవారం ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ ప్రశ్న పత్రాలు చేరాయి. ఈ మేరకు ఒకే షనల్ కోర్సుకు సం బంధించిన ప్రశ్నపత్రాలు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల ఆధ్వర్యంలో భద్రపరిచారు. ఈనెల 24వ తేదీ నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు కోటలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులం, విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలల పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు చేపడుతున్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ తరగతులు



కేడెట్లకు జ్ఞాపిక అందజేస్తున్న విజయకుమార్ రెడ్డి

కోట, మే 21: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ నావెల్ రింగ్ కేడెట్లకు జరిగిన శిక్షణ తరగతులు మం గళవారం పూర్తయ్యాయి. కేడెట్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి అభినందిం చారు. మూడేళ్లుగా కళాశాల ఆధ్వర్యంలో జరిగిన అన్ని సాంఘిక కార్యక్ర మాల్లో ఎన్‌సీసీ నావెల్ రింగ్ కేడెట్ల భాగస్వామ్యం అభినందనీయమని విజయకుమార్‌రెడ్డి అన్నారు. అదే విధంగా ఎన్‌సీసీ నావెల్ రింగ్ క్యాడెట్ కెప్టెన్ పెన్నా లౌక్య, క్యాడెట్ కెప్టెన్ భార్గవ్, శ్రీహరి, జోష్‌వర్ధన్‌ను ప్రత్యేకంగా అభినందించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం 2వ బ్యాచ్ కేడెట్ల ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

గుండెపోటుతో టీడీపీ నాయకుడి మృతి

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల సంతాపం



భాస్కర్ రెడ్డి మృతదేహం

డక్కిలి, మే 21: టీడీపీ నాయకుడు, పెంచల కోన ట్రస్టు బోర్డు మాజీ సభ్యుడు చెలికం భాస్కరరెడ్డి మంగళవారం గుండెపోటుతో మరణించారు. ముప్పై ఏళ్లుగా ఆయన రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం టీడీపీలో కొనసాగుతున్న ఆయన గతంలో నేదురుమల్లి జనార్దన రెడ్డి ముఖ్య అనుచరుడు. డక్కిలి ఆసుపత్రి సలహా కమిటీ చైర్మన్‌గా వ్యవ హరించారు. ఇటీవల టీడీపీలో చేరి కురుగొండ్ల రామకృష్ణ కోసం పనిచేశారు. భాస్కరరెడ్డి మృతి చెందాడని తెలియగానే తాను దిగ్భ్రాంతికి లోనైనట్లు కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కుటుంబసభ్యులను ఆయన ఫోన్‌లో పరామర్శించారు. ఆయన మృతి పట్ల టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు వెంపటి మాధవ నాయుడు సంతాపం వెలిబుచ్చారు. టీడీపీ శ్రేణులు భాస్కరరెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళి అర్పిం చారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి పి.రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర ప్రచార కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, పి.వెంకటరెడ్డి తమ సంతాపాన్ని తెలిపారు.

ముగ్గురు సీఎంవోలకు మెమో

తిరుపతి(వైద్యం), మే 21: అత్యవసర విభాగానికి తీసుకొచ్చిన ఓ రోగికి వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన విషయంపై 'రుయాలో అందని అత్యవసర వైద్యం' శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన సూపరింటెండెంట్ రవిప్రభు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు సీఎంవో(క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్స్)లకు మెమో జారీ చేశారు. ఆస్పత్రిలో రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. కాగా, రోగిని నిర్లక్ష్యంగా బయటకు పంపేయడంపై అధికారులకు సమాచారం ఇచ్చిన సెక్యూరిటీ సిబ్బందిపై సీఎంవోలు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

అధ్వానంగా పార్కులు.. పట్టించుకోని అధికారులు



పోలిశెట్టి గుంట పార్కులో అధ్వానంగా ఉన్న పరిసరాలు - అధ్వానంగా ఉన్న కుమ్మరిగుంట పార్కు - మున్సిపల్ పార్కులో దుస్థితికి చేరుకున్న సిమెంటు బల్ల

వెంకటగిరి టౌన్, మే 21: మానసిక ఒత్తిడి నుంచి కొంతసేపైనా సేద తీరేందుకు వేదిక అవసరం. అయితే ఆహ్లాదకరమైన క్షణాలను గడిపేందుకు వెంకటగిరి పట్టణంలో పార్కులు అనువుగా లేకపోవడం వల్ల స్థానికులు ఆ వాతావరణానికి దూరమవుతున్నారు.

దశాబ్దాల క్రితం పట్టణానికే ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గాంధీ పార్కు, లక్ష్మీ పార్కు శిథిలావస్థకు చేరాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచిపెట్టిన పార్కు నిర్వహణను మున్సిపల్ అధికారులు పట్టించుకోక పోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులకు ఆటపాటలు, పెద్దల వ్యాహ్యాళికి ఉపయోగపడిన పార్కులు దుస్థితికి చేరాయి.

దుస్థితికి చేరిన పార్కులు...

త్రిభువని సెంటర్‌లో ఉన్న లక్ష్మీ పార్కు కనుమరుగైంది. తూర్పువీధిలో ఉన్న గాంధీజీ పార్కును 1948లో అప్పటి మద్రాసు స్థానిక స్వపరిపాలన మంత్రి కె.చంద్రమౌళి ప్రారంభించారు. నేడు పార్కు ప్రహరి కూలిపోయి దుస్థితిలో ఉన్నా అధికారులు మరమ్మతులకు చర్యలు చేపట్టలేదు. ఇక్కడ గ్రంథాలయం ఏర్పాటు చేస్తుండడంతో పార్కు పూర్తిగా మూసుకుపోయింది. వెంకటగిరి మున్సిపాలిటీ అయిన తరువాత కుమ్మరిగుంట వద్ద పార్కును ఏర్పాటు చేసేందుకు రూ.10లక్షలు ఖర్చుచేశారు. కొంతకాలం బోటు షికారు ఏర్పాటు చేశారు. అనంతరం బోటుషికారు ఎత్తివేయగా ప్ర స్తుతం దుస్థితిలో ఉంది. ఈ పార్కులో కూర్చు నేందుకు ఏర్పాటు చేసిన బల్లలు దెబ్బతింటున్నాయి. స్థానిక విద్యార్థులు చదువుకునేందుకు ఎక్కువగా ఈ పార్కును ఉపయోగిస్తున్నారు. ఈ ప్రాంతంలో ముళ్ల పొదలు, చెట్టుపుట్ట పెరిగిపోవడంతో విషసర్పాల బెడద ఉందని విద్యార్థులు తెలిపారు. పోలిశెట్టిగుంట వద్ద రూ.20లక్షలతో పార్కును ఏర్పాటు చేశారు. అయితే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోవడంతో నామమాత్రంగా ఉం టోంది.

ఎమ్మెల్యే సస్పెన్షన్‌తో...

కుమ్మరిగుంట వద్ద పార్కును అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే ఆనం ఆధ్వర్యంలో రూ.1.20కోట్లతో గత అక్టోబరులో శిలాఫలకం నాటారు. కుమ్మరిగుంట వద్ద వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ ఏడాది జనవరిలో ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో పనులు ఆగిపోయాయి.

అనుమానితులపై సమాచారం ఇవ్వండి

పలు ప్రాంతాల్లో డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్



ఎన్ఎస్ఆర్ కాలనీలో సూచనలు ఇస్తున్న నాయుడుపేట డీఎస్పీ - స్వాధీనం చేసుకున్న వాహనాలతో సూళ్లూరుపేట పోలీసులు

గూడూరు, మే 21: తమ ప్రాంతాల్లో కొత్తవ్యక్తులు సంచరిస్తున్నా, అనుమానిత వాహనాలున్నా వెంటనే సమాచారం అందించాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చెప్పారు. మంగళవారం రెండో పట్టణ పరిధిలోని గాంధీనగర్, ప్రశాంతినగర్, ఇందిరమ్మకాలనీ, టిడ్కో గృహ సముదాయ ప్రాంతాల్లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివారు ప్రాంతాల్లో పోలీసుల నిఘా తీవ్రతరం చేశామన్నారు. బయటప్రాంతాలకు చెందిన వ్యక్తులు ఇక్కడ తలదాచుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ముందుస్తు చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో పోలీసుల పహారా కొనసాగుతుందన్నారు. అనంతరం పలు వాహనాలు తనిఖీ చేసి రికార్డుల్లేని వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సీఐలు రవికిరణ్, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐలు మనోజ్‌కుమార్, అంజిరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీలో డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఎన్ఎస్ఆర్‌కాలనీలో వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఎన్నికల లెక్కింపు నేపథ్యంలో ఘర్షణలకు దిగితే కఠినచర్యలు తప్పవన్నారు. అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

తడ: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ నరసింహారావు తెలిపారు. మంగళవారం తడ బజారుకూడలిలో వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల వాహనాలను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలో మంగళవారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ మధుబాబు, ఎస్ఐ రహీంరెడ్డి సిబ్బందితో ప్రతి ఇంటికి వెళ్లి వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 7 బైక్‌లు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. జూన్ 6 వరకు పోలీసు యాక్టు అమలులో ఉంటుందన్నారు.

రెండున్నర కిలోల గంజాయి

సూళ్లూరులో కార్డన్ సెర్చిలో ఓ ఇంట్లో గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని మహిళ సహా మరో ఇద్దరూ యువకులను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. కానీ గంజాయి స్వాధీనం చేసుకున్న విషయాన్ని పోలీసులు బయటకు పొక్కనీయకుండా రహస్యంగా ఉంచారు.

జాయింట్ సర్వే నిర్వహించి న్యాయం చేయండి

యానాది సంక్షేమ సంఘం



గిరిజనులతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న యానాది సంఘ నాయకులు

డక్కిలి, మే 21: మండలంలోని మోపూరు గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సంబంధించి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి న్యాయం చేయాలంటూ యానాది సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం జరిగింది. యానాది సంఘం జిల్లా అధ్యక్షుడు టి.మల్లికార్జునరావు మాట్లాడుతూ... మోపూరు సర్వే నెం.1 లో మోపూరుకు చెందిన పలు గిరిజన కుటుంబాలు గత కొన్నేళ్లుగా సాగు చేసుకుంటున్నారని చెప్పారు. ఆ భూములు తమ శాఖకు చెందినవంటూ ఇటీవల అటవీశాఖ అధికారులు గిరిజనులపై దాడులకు దిగుతున్నారని వాపోయారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూములు అనాధీన భూములోగా నమోదు అయివున్నా యని చెప్పారు. అనంతరం వారు తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కె.సి.పెంచలయ్య, ఉష తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఫిర్యాదు



కోట పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కోట, మే 21: తమపై దాడి చేశారంటూ పంచాయతీ పారిశుధ్య కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట పంచాయతీ కార్యాలయ పారిశుధ్య కార్మికులు విధుల్లో భాగంగా డ్రైనేజీ కాలువల్లోని చెత్తను ఎత్తుతున్నారు. చెత్తను ఎత్తే విషయమై గిరీష్‌కుమార్ అనే యువకుడు పారిశుధ్య కార్మికులతో వాగ్వాదానికి దిగాడు. మాటామాటా పెరిగి రెచ్చిపోయిన గిరీష్‌కుమార్ ముగ్గురు కార్మికులపై దాడి చేశాడు. దీంతో కార్మికులంతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గిరీష్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.40 కోట్లు

తిరుమల, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.40 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 85,825 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

క్రీడా సామగ్రి వితరణ



కోట, మే 21: మండల పరిధిలోని కర్లపూడిలో మంగళవారం స్థానిక యువతకు క్రికెట్, వాలీబాల్ కిట్లను వితరణ చేశారు. సర్పంచ్ సన్నారెడ్డి రాజ్యలక్ష్మి తరపున ఆమె భర్త, సిద్ధవరం సొసైటీ మాజీ అధ్యక్షుడు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి చేతులమీదుగా కర్లపూడి యువతకు వాటిని అందజేశారు. చంద్రశేఖర్, శ్రీహర్ష, రాజా, నాగేంద్ర, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసు దాడులు

వాకాడు, మే 21 : మండల తీరప్రాంతమైన నిమ్మవానితిప్ప అటవీ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేల స్థావరాలపై పోలీసులు మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఎస్ఐ పవన్‌కుమార్ సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.4వేలు, 5 కోళ్లను, కోళ్లకు కట్టె కత్తులను స్వాధీనం చేసుకున్నారు. దాడి సమయంలో నలుగురు పట్టుబడగా మిగిలిన వారు పరారయ్యారు. పట్టుబడ్డవారిపై కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెత్త ఎత్తండి సారూ!



తోలిమిట్ట రోడ్డులో...

వెంకటగిరిటౌన్, మే 21: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులు చెత్తచెదారాలతో నిండిపోయాయి. అన్ని చెత్త కుండీలు నిండిపోయి రోడ్లపై పేరుకుపోతున్నాయి. పాత బస్టాండ్, పాలకేంద్రం, బంగారుపేట, కాలేజీ మిట్ట, ఎన్టీఆర్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, కాశీపేట, తోలిమిట్ట తదితర ప్రాంతాల్లో చెత్త రోడ్లపై పేరకు పోయింది. ఇటీవల తోలిమిట్టలో ఓ చిన్నారి చెత్త పారేసేందుకు వెళ్లగా కుక్కలు దాడి చేశాయి. పలు వీధుల్లో కుక్కలు, పశువులకు చెత్తకుప్పలు అడ్డాగా మారాయి.మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది ఇప్పటికైనా చెత్త తొలగించాల్సి ఉంది.



పాత బస్టాండ్ వద్ద...





పెంచలకోన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వివిధ సేవలతో అలసిపోయిన శ్రీవారిని సేద తీర్చేందుకు అర్చకులు 12 గంటలకు స్నపన తిరుమంజనం జరిపించారు. అనంతరం సుందరంగా అలంకరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

- డక్కిలి

కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



నాయుడుపేట టౌన్, మే 21: పట్టణ సమీపంలోని తుమ్మూరులో కొలువై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం శాస్త్రోక్తంగా జరిగింది. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ ఘట్టాన్ని ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి శేషవాహనంపై కరిమాణిక్యస్వామి విహరించి భక్తులను కటాక్షించారు.

పోలేరమ్మకు వెండికవచం బహూకరణ



నాయుడుపేట టౌన్, మే 21: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద కొలువై ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి నాయుడుపేటకు చెందిన అంకమ్మ వెండి కవచం అందజేశారు. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం వెండి కవచాన్ని అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో బాబు, పూజారి గణపతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి హనుమంతవాహనసేవ



చిల్లకూరు, మే 21: మండలంలోని కలవకొండలో కొలువై ఉన్న లక్ష్మీనరసింహ స్వా మి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, పలు ప్రత్యేకపూజలను నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి హను మంత వాహనంపై అధిష్టింపజేసి విశేషపూజలు జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం జరిగింది.

విజయదుర్గాదేవికి హోమ పూజలు



గూడూరు అర్బన్, మే 21: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో మంగళవారం అమ్మవారికి హోమపూజలు నిర్వహించారు. ఈ ఉప పీఠంలో అమ్మవారికి శ్రీచక్ర ప్రతిష్ఠ జరిపి 16 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వార్షికోత్సవ పూజలను నిర్వహించారు. ఉదయం అమ్మవారికి మహామృత్యుంజయ అమృత పాశుపత మహా రుద్రాభిషేక హోమం జరిపారు. సాయంత్రం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామికి శత్రుసంహార త్రిసతిహోమాన్ని శాస్త్రోపేతంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ఏపీడీ విచారణ



ఉపాధి కూలీలను విచారిస్తున్న ఏపీడీ

పెళ్లకూరు, మే 21 : మండలంలోని శిరసనంబేడులో ఉపాధి హామీ పథక పనుల్లో జరిగిన అక్రమాలపై మంగళవారం డ్వామా ఏపీడీ రవికుమార్ నాయుడు విచారణ చేపట్టారు. వారం రోజులు ఉపాధి పనులు చేస్తే మూడు రోజులుకు మాత్రమే కూలి చెల్లిస్తున్నారని మిగిలిన మూడు రోజులు పనికి హాజరుకాని వారి పేర్లను మస్టర్లలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున్ నమోదు చేస్తున్నారంటూ ఉపాధి కూలీలు ఫిర్యాదు చేయండంతో విచారణ చేపట్టారు. గ్రామంలోని రాజకీయ నాయకులు, ఉద్యోగుల పేర్ల మీద మస్టర్లు వేస్తున్నారని వీటిపై విచారణ చేసి జిల్లా అధికారులకు నివేదిక అందిస్తున్నట్టు ఏపీడీ తెలిపారు. ఏపీవో దయానందం, టెక్నికల్ అసిస్టెంట్ షమీ ఉన్నారు.


చెరువు కట్ట తొలగింపుపై ఫిర్యాదు



చేపల పెంపకందారుడిని విచారిస్తున్న ఏఈ

పెళ్లకూరు, మే 21: మండలంలోని చిల్లకూరు పెద్ద చెరువు కట్టను యంత్రాలతో చేపల పెంపకందారులు తొలగించడంపై గ్రామస్తులు మంగళ వారం నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువులో చేపల పెంపకానికి వడ్డిపాళేనికి చెందిన ఎం.రమణయ్య వేలం దక్కించుకున్నాడు. ఈక్రమంలో చెరువు అడుగున ఉన్న చేపలు పట్టుకునేందుకు ఉన్న కొద్ది నీటిని కిందకు వదిలేందుకు ఎక్స్‌కవేటరతో కట్టను తొలగించాడు. దీనిపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు నీటి పారుదల శాఖ ఏఈ మహేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీహరి చెరువు కట్టను తొలిగించిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ కట్టను రెండు చోట్ల తొలిగించిన రమణయ్యపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సంయమనం పాటించండి



నాయకులకు సూచనలిస్తున్న డీఎస్పీ

ఓజిలి, మే 21: శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పార్టీల నాయకులు సంయ మనం పాటించాలని నాయుడు పేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. ఓజిలి పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఆయన మండలంలోని అన్ని పార్టీ నాయకులతో ప్రత్యేక సమా వేశం నిర్వహించారు. ఇంకా 144 సెక్షన్ అమలులో ఉన్న దృష్ట్యా అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. కౌం టింగ్ పూర్తయ్యే వరకు జిల్లావ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రవిబాబు, నాయకులు పివెంకటసుబ్బయ్య, బి.పృథ్వీకృష్ణ, రఫీ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.